APTEL/2008/28200

## ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ మళ్ళీ వాయిదా

న్యూ ఢిల్లీ : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ మళ్ళీ వాయిదా పడింది. సీబీఐ కేసులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు కవిత. అయితే ఆగస్టు 7న తుది వాదనలు వింటామని తెలిపింది, ట్రయల్ కోర్టు. సీనియర్ అడ్వకేట్ అందుబాటులో లేకపోవడంతో కేసును మరో రోజుకు వాయిదా వేయాలని కోరిన కవిత తరపు లాయర్ కోర్టును కోరారు. ఈ క్రమంలో తదుపరి విచారణను జడ్జ్ కావేరి భవేజా వాయిదా వేశారు. కాగా కవితను మార్చి– 15న తొలుత ఈడీ, ఆ తర్వాత ఏప్రిల్– 11న సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే. జైలులో ఉన్న కవితను ఆమె సోదరుడు, మాజీ మంత్రులు కల్వకుంట్ల కేటీఆర్, తన్నీరు హరీశ్ రావు కలిసినట్లు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.




# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం


## పారిస్ ఒలింపిక్స్ కు తెలంగాణ అధికార బృందం

హైదరాబాద్ ఆగష్టు 5 : ప్యారిస్ లో జరుగుతున్న ఒలంపిక్స్ 2024 ను సందర్శించేందుకు తెలంగాణ అధికార బృందం ఈరోజు బయలుదేరింది.ఎం రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేనారెడ్డి నేతృత్వమ్ లో ప్రభుత్వ సలహాదారులు( క్రీడలు) జితేందర్ రెడ్డి గారు, శాసనమండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్, వి సి ఎండీ ఏ. సోనీ బాలాదేవి ఐఎఫ్ఎస్, ఎన్ .ప్రకాష్ రెడ్డి ఐపీఎస్, కేంద్ర మాజీ మంత్రి ఎస్ వేణుగోపాల చారి, మరియు ఎం రవీందర్ రెడ్డిలు ఈ బృందంలో ఉన్నారు. క్రీడా స్టేడియాల సందర్శన, ఒలంపిక్స్ పోటీలకు చేసిన ఏర్పాట్లు, భవిష్యత్తులో ఒలంపిక్స్ నిర్వహణకు ఉన్న అవకాశాల పరిశీలన, వివిధ దేశాలు క్రీడల్లో అభివృద్ధి సాధించడానికి అనుసరిస్తున్న విధానాలు.

సంపుటి: 16 సంచిక : 86 కరీంనగర్ మంగళవారం, ఆగష్టు 06, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు

## అమెరికాకు మీరే ఆయువుపట్టు
# ఇక తెలంగాణకు రండి.. పెట్టుబడి పెట్టండి: ప్రవాసులతో సీఎం రేవంత్‌రెడ్డి



రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు తీసుకురావడంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అమెరికాలోని తెలుగు రాష్ట్రాల ప్రవాసులకు పిలుపునిచ్చారు. న్యూజెర్సీలో ఆదివారం జరిగిన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళానికి వేలాది మంది తరలివచ్చారు. ఈ సందర్భంగా దారిపొడవునా భారీ ర్యాలీతో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు తీసుకురావడంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అమెరికాలోని తెలుగు రాష్ట్రాల ప్రవాసులకు పిలుపునిచ్చారు. న్యూజెర్సీలో ఆదివారం జరిగిన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళానికి వేలాది మంది తరలివచ్చారు. ఈ సందర్భంగా దారిపొడవునా భారీ ర్యాలీతో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "తెలంగాణ మీ జన్మభూమి, మీ దేశంలో మీరు పెట్టిన ప్రతి పెట్టుబడికి తప్పకుండా ప్రయోజనం ఉంటుంది. అంతకు మించిన అత్యుత్తమ ప్రతిఫలం ఉంటుంది. మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకుంటే అంతకు మించిన సంతృప్తి బోనస్ గా లభిస్తుంది..' అని ఎన్నారైలలో ఉత్సాహం నింపారు. "గత సంవత్సరం టీపీసీసీ అధ్యక్షుని హెూదాలో అమెరికాకు వచ్చాను. పదేండ్ల పాటు సాగిన దుష్పరిపాలనకు, విధ్వంసాలకు విముక్తి పలికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే మళ్లీ వస్తానని చెప్పాను. నేను ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాను" అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఇప్పటికే రైతులు, మహిళలు, యువకుల సంక్షేమం, అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీతో పాటు, ఇన్ పుట్ సబ్సిడీగా రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కు వంట గ్యాస్ సిలిండర్, నిరుపేదలకు 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్తు, ఉపాధ్యాయులకు పదోన్నతులు, విద్యార్థులకు నాణ్యమైన విద్య పథకాలను అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది ప్రారంభం మాత్రమే అని.. భవిష్యత్తు ప్రణాళికలతో తమ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. తమ పరిపాలనపై ఎలాంటి అపోహలు, ఆందోళనలకు తావు లేదని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని సమ్మిళిత ఆర్థిక వృద్ధిని వేగంగా సాధించే తమ ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానాన్ని తీసుకు వస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నిధుల సమీకరణతో పాటు ఎక్కువ మందికి ఉపాధి కల్పన, నైపుణ్యాల వృద్ధికి అందులో సమానమైన ప్రాధాన్యమిస్తామని చెప్పారు. 'ఎన్నికల ముందు మాపై ఎంతో విష ప్రచారం జరిగింది.. గిట్టని వాళ్లందరూ అసలు కాంగ్రెస్ అధికారంలోకి రాదని అన్నారు. వచ్చినా అది ఉండనే ఉండదన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అభివృద్ధి మందగిస్తుందంటూ లేని పోని అపోహలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే వాళ్లకు తగిన బుద్ధి చెప్పాం. అబద్ధాలకోరుల మాటలు తప్పని మరోసారి నిరూపిస్తాం. హైదరాబాద్‌ను భారతదేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా అభివృద్ధి చేసేందుకు పోటీ పడతాం ' అని సీఎం ప్రకటించారు.

# ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా
# సైనికపాలన దిశగా బంగ్లాదేశ్



బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేశారు. షేక్ హసీనా రాజీనామా చేయాలంటూ గత కొంతకాలంగా విద్యార్థులు భారీ ఆందోళన చేపట్టారు. ఆదివారం చెలరేగిన అల్లర్లలో 100 మందికి పైగా చనిపోయారు. హింసలో ఇప్పటివరకు 300 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. శాంతిభద్రతలు అదుపు తప్పడంతో వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని షేక్ హసీనాకు బంగ్లా సైన్యం డెడ్‌లైన్ విధించింది. సైన్యం ఇచ్చిన 45 నిముషాల డెడ్‌లైన్ లోపే ఆమె తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా ప్రకటనకు ముందు షేక్ హసీనా ఢాకా ప్యాలెస్ నుంచి తన సోదరి గణభబన్ తో కలిసి సురక్షిత ప్రదేశానికి బయలుదేరినట్లు వార్తా సంస్థ సోమవారం నివేదించింది. బంగ్లాదేశ్ నుంచి పారిపోయిన షేక్ హసీనాకు భారత్‌లో ఆశ్రయం లభించింది. హసీనా ఢాకా నుంచి అగర్తలా (త్రిపుర) కు పయనమయ్యారు. హసీనా ఇంటి దగ్గర సైన్యం గట్టి భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ.. ఆందోళనకారులు.. అక్కడికి చేరుకుని రాళ్లు రువ్వారు..దీంతోపాటు ప్రధాని కార్యాలయానికి నిప్పు పెట్టారు. బంగ్లాదేశ్ లో తాజా పరిస్థితుల నేపథ్యంలో శాంతిభద్రతల విధుల నుంచి పోలీసులను తప్పించి ఆర్మీ ఆ బాధ్యతలను చేపట్టింది. దేశమంతా కర్ఫ్యూ విధించారు. కాగా.. ఆదివారం చెలరేగిన అల్లర్లలో ఆందోళనకారులు మంత్రుల ఇళ్లకు, ప్రభుత్వ కార్యాలయాలకు నిప్పుపెట్టారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో బంగ్లా అమరవీరుల కుటుంబాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రధాని షేక్ హసీనా తీసుకున్న నిర్ణయం చిచ్చురేపింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశమంతటా ఆందోళనలు చెలరేగాయి. ఆదివారం ఆందోళన మరింత ఉద్రిక్తతలకు దారితీసింది. దాదాపు 100 మంది వరకు మరణించారు. దేశవ్యాప్తంగా ఆదివారం జరిగిన ఘర్షణలు తర్వాత హసీనా రాజీనామా చేయాలని ఒత్తిడి తెచ్చేందుకు, దేశవ్యాప్తంగా కర్ఫ్యూను ధిక్కరిస్తూ విద్యార్థి సంఘాలు రాజధాని ఢాకాకు మార్చ్‌కు పిలుపునిచ్చారు.

## కోచింగ్ సెంటర్లు 'డెత్ ఛాంబర్స్' లాంటివి
# అభ్యర్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయ్ : సుప్రీం కోర్టు



ఢిల్లీలోని ఓల్డ్ రాజేందర్ నగర్‌లో గల ఓ కోచింగ్ సెంటర్‌లోకి వరద నీరు ప్రవేశించి ముగ్గురు విద్యార్థులు మరణించిన విషయం తెలిసిందే. రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో గత నెల 27 శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటనలో సివిల్స్ అభ్యర్థుల మృతిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ మేరకు కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. విచారణ సందర్భంగా కోచింగ్ సెంటర్లను సుప్రీం ధర్మాసనం 'డెత్ ఛాంబర్స్'గా అభివర్ణించింది. అభ్యర్థుల జీవితాలతో కోచింగ్ సెంటర్లు ఆడుకుంటున్నాయని వ్యాఖ్యానించింది. ఈ ఘటన ఓ కనువిప్పు లాంటిదని పేర్కొంది. అన్ని భద్రతా ప్రమాణాలను పాటించే కోచింగ్ సంస్థలకే అనుమతులు ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు రావూస్ ఘటన నేపథ్యంలో విద్యార్థుల భద్రతపై ఎలాంటి చర్యలు తీసుకున్నారంటూ.. కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. ఢిల్లీలోని ఓల్డ్ రాజేందర్ నగర్‌లో గల ఓ కోచింగ్ సెంటర్‌లోకి వరద నీరు ప్రవేశించి ముగ్గురు విద్యార్థులు మరణించిన విషయం తెలిసిందే. రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో (%జశ్ఖుఎష్ట్రఱఅస్త్ర జవత్‌తీవ%) గత నెల 27 శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. రాత్రి 7 గంటల సమయంలో రావుస్ స్టడీ సర్కిల్ బేస్‌మెంట్‌లోకి ఒక్కసారిగా వరద నీరు చేరింది. ఈ సమయంలో బేస్‌మెంట్‌లో ఉన్న లైబ్రరీలో దాదాపు 18 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 15 మంది ఎలాగోలా బయటపడగా, ముగ్గురు మాత్రం నీటిలో మునిగిపోయారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఢిల్లీ అగ్నిమాపక శాఖ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వచ్చి వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ ఘటనలో తెలంగాణలోని మంచిర్యాల జిల్లాకు చెందిన తాన్యా సోని(21), ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్‌కు చెందిన శ్రేయ యాదవ్(25), కేరళలోని ఎర్నాకుళంకు చెందిన నవీన్ దల్విన్(29) వరదనీటిలో మునిగి మరణించారు. లైబ్రరీ డోర్‌కు బయోమెట్రిక్ వ్యవస్థ ఉందని, ఇది లాక్ అయిపోవడం వల్లే వీరు బయటకు రాలేకపోయారని పలువురు విద్యార్థులు చెప్తున్నారు.

# తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ చైర్‌పర్సన్‌గా ఆనంద్ మహీంద్రా: సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ చైర్‌పర్సన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వయంగా వెల్లడించారు. అమెరికా పర్యటనలో న్యూజెర్సీలో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీపీపీ మోడల్ లో స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. దీనికి చైర్‌పర్సన్‌గా ఉండాలని ఆనంద్ మహీంద్రాను తాను రిక్వెస్ట్ చేశానని, రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపడతారని వెల్లడించారు. ప్రపంచంలో నైపుణ్యానికి చాలా డిమాండ్ ఉందని, అందుకే తెలంగాణలో స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని వివరించారు. ఇందులో ఐటీ, వైద్య, క్రీడా రంగాలతో పాటు పలు అంశలపై శిక్షణనిస్తామని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులకు తమ ప్రభుత్వం రెడ్ కార్పెట్ తో స్వాగతం పలుకుతుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ఎన్నారైలు సహకరించాలని ఆయన కోరారు. తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్లకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీయిచ్చారు. హైదరాబాద్ లో పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయని.. ప్రపంచంతోనే తెలంగాణ పోటీ పడుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడంలో ఎన్నారైలు కీలకపాత్ర పోషించారని ప్రశంసించారు. బీఆర్ఎస్ ఓటమితో తెలంగాణకు స్వేచ్ఛ లభించిందని, పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని సీఎం రేవంత్ విమర్శించారు. ఎన్నారైల సహకారంతో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వంలో 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలకు నియామకపత్రాలు ఇచ్చిందని తెలిపారు. మరో 35 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చిందని చెప్పారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలు సజావుగా జరిగాయని.. బీఆర్ఎస్ చర్చల్లో పాల్గొనకుండా తప్పించుకునే ప్రయత్నం చేసిందన్నారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన సందర్భంగా అంతకుముందు న్యూజెర్సీలో కాంగ్రెస్ అభిమానులు భారీ కార్ ర్యాలీ నిర్వహించారు.

## రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా.. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ విభజనను ఆ రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ముఖ్యంగా ఉత్తర బెంగాల్‌తో కూడిన ప్రత్యేక కేంద్ర పాలిత ప్రాంతం ఏర్పాటు చేయాలని పలు వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సోమవారం రూల్ 185 కింద అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసింది. సీఎం మమతా బెనర్జీ ఈ తీర్మానం గురించి అసెంబ్లీలో మాట్లాడారు. కోఆపరేటివ్ ఫెడరలిజాన్ని తాము నమ్ముతామని, అయితే రాష్ట్రాన్ని విభజించే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని అన్నారు. కాగా, బెంగాల్ విభజన డిమాండ్‌ను తెరపైకి తెచ్చిన ప్రతిపక్ష బీజేపీ కూడా విభజన వ్యతిరేక తీర్మానానికి మద్దతిచ్చింది. అయితే ఉత్తర ప్రాంతాల అభివృద్ధిని కోరుతున్నట్లు పేర్కొంది. తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడైన సువేందు అధికారి మాట్లాడారు. 'ఐక్య పశ్చిమ బెంగాల్ సమగ్ర అభివృద్ధిని మేం కోరుకుంటున్నాం. రాష్ట్రాన్ని విభజించే ఏ ప్రయత్నానికైనా మేం వ్యతిరేకం' అని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్ సమగ్ర అభివృద్ధి గురించి తీర్మానంలో ప్రస్తావించాలని కోరారు. మరోవైపు ఈ ప్రతిపాదనను తీర్మానంలో చేర్చేందుకు సీఎం మమతా బెనర్జీ అంగీకరించారు. చర్చల అనంతరం 'ఎలాంటి విభజన డిమాండ్ చేయకుండా బెంగాల్‌ను ఆదుకుంటాం', 'బెంగాల్ అభివృద్ధికి కృషి చేస్తాం' అన్న ప్రత్యామ్నాయ తీర్మానాలను సభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. గత ఏడాది ఫిబ్రవరిలో కూడా రాష్ట్ర విభజన ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఒక తీర్మానాన్ని వాయిస్ ఓటింగ్ ద్వారా అసెంబ్లీలో ఆమోదించారు.

## శ్రీశైలం దేవస్థానానికి ఏసీ బస్సు నడిపిస్తాం : మంత్రి పొన్నం ప్రభాకర్



శ్రీశైలం : హైదరాబాద్ నుంచి శ్రీశైలం దేవస్థానానికి ప్రతి రోజూ ఒక ఏసీ బస్సును నడిపించేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు. శ్రీశైల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారిని సోమవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల ప్రజలు బాగుండాలని స్వామి, అమ్మవార్లను వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని ప్రతి మండలం నుంచి జిల్లాకేంద్రానికి ఓ ఏసీ బస్సును నడిపించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. అవసరమైతే మండల కేంద్రం నుంచి స్థానికుల అవసరాలుంటే హైదరాబాద్‌కు ఏసీ బస్సును వేయనున్నట్లు తెలిపారు. హామీ ఇచ్చిన విధంగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేల పైన అనర్హత వేటు తప్పదు : కేటీఆర్



హైదరాబాద్ : పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత విషయంలో న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఢిల్లీలోని పలువురు ప్రముఖ న్యాయ కోవిదులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుల బృందం చర్చలు జరిపింది. అటు రాజ్యాంగ నిపుణులతోనూ ఇవాళ పార్టీ ప్రతినిధి బృందం సమావేశమైంది. ఇప్పటికే పార్టీ ఫిరాయింపుల విషయంలో మణిపూర్‌కు సంబంధించిన ఎమ్మెల్యే సహా సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందని రాజ్యాంగ నిపుణులు చెట్పట్ ఆర్యమా సుందరం పార్టీ బృందానికి తెలిపారు. గతంలో మాదిరిగా అనర్హత వేటు విషయంలో సుదీర్ఘ కాలం పాటు నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ ఈ అంశాన్ని నాన్చలేరని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హత వేటుకు సంబంధించి హైకోర్టులో వేసిన పిటిషన్‌తో పాటు, పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన స్పీకర్‌కు చేసిన ఫిర్యాదు విషయాన్ని, వాటికి సంబంధించిన పత్రాలను న్యాయ నిపుణులకు బీఆర్ఎస్ నేతలు అందించారు. ఈ విషయంలో ప్రస్తుతం సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నందున హైకోర్టు సైతం ఎక్కువ కాలం వాయిదా వేసే అవకాశం లేదని న్యాయ నిపుణులు తెలిపారు. హైకోర్టు నిర్ణయం త్వరగా ప్రకటించకుంటే సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పులతోపాటు న్యాయ కోవిదులు, రాజ్యాంగాన్ని నిపుణులు చెబుతున్న సలహాలు, సూచనల మేరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ తెలిపారు. త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు.

తెలంగాణ నుండి ఫోకస్
తెలుగు దినపత్రిక
మంగళవారం, ఆగష్టు 06, 2024

# కేసీఆర్, జగన్ పయనం ఎటు?

రాజకీయ స్నేహితులు కేసిఆర్, జగన్ పయనం ఎటు? ఎన్డీఏ కూటమిలో చేరుతారా? ఇండియా కూటమిని ఆశ్రయిస్తారా? ఇద్దరూ కలిసి నిర్ణయం తీసుకుంటారా?లేకుంటే వేర్వేరు మార్గాల్లో వెళ్తారా?తెలుగు రాష్ట్రాల్లో ఇదే చర్చ నడుస్తోంది.దాదాపు ఇద్దరి పరిస్థితి అలానే ఉంది.2018 ఎన్నికల్లో ఓడిపోయారు కేసీఆర్. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు కూడా రాలేదు. దీంతో తెలంగాణలో కెసిఆర్ పార్టీ మనుగడ కూడా కష్టమవుతోంది. ఆ పార్టీ నుంచి ఇతర పార్టీలోకి చేరికలు పెరిగాయి. ఏకంగా ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ లోకి క్యూపడుతున్నారు. మరోవైపు కుమార్తె కవిత అవినీతి కేసుల్లో చిక్కుకొని జైలు జీవితం అనుభవిస్తున్నారు. ఏపీలో కూడా జగన్ పరిస్థితి అలానే ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం ఎదురైంది. 11 అసెంబ్లీ సీట్లకే పరిమితమైంది. కనీసం జగన్ కు ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. దీంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు అక్రమాస్తుల కేసులు, బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య అంశం తెరపైకి వస్తోంది.రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులపై దాడులు,కేసులు ఎదురవుతున్నాయి. ఈ తరుణంలో పార్టీని కాపాడుకోవడం ఇబ్బందికరమే. అధికారంలో ఉన్న సమయంలో రాజకీయ శత్రువులను పెంచుకున్నారు ఈ ఇద్దరు నేతలు. సొంత రాష్ట్రాలతో పాటు జాతీయస్థాయిలో నమ్మదగిన స్నేహాన్ని కొనసాగించలేకపోయారు. దాని ప్రభావం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. తాము ఇబ్బందుల్లో ఉన్న పట్టించుకునే వారు కరువయ్యారు. కనీసం మద్దతు తెలిపేందుకు కూడా ముందుకు రాని పరిస్థితి. అందుకే వీరిద్దరూ పునరాలోచనలో పడ్డారు. జాతీయస్థాయిలో స్నేహం పెంచుకోవాలని చూస్తున్నారుఈ ఇద్దరు నేతలకు ఇప్పుడు జమిలి ఎన్నికల భయం పట్టుకుంది. 2019 నుంచి కార్యాచరణ ప్రారంభించింది బిజెపి. కానీ 2024 ఎన్నికలకు ఒక ఏడాది ముందు జమిలి ఎన్నికలకు సంబంధించి కార్యాచరణ ప్రారంభమైంది. సాధ్యాసాధ్యాలపై ఒక కమిటీని వేసింది కేంద్రం. ఈ కమిటీకి అధ్యక్షుడిగా మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ని నియమించింది. ఆయన నాయకత్వంలో కమిటీ ఇప్పటికే చాలాసార్లు భేటీ అయింది. 2029 నాటికి దేశంలో జమిలి ఎన్నికలు జరుగుతాయని చెబుతున్నారు. అదే జరిగితే దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరగనున్నాయి. జాతీయ పార్టీల ప్రభావం ప్రాంతీయ పార్టీలపై తప్పకుండా పడుతుంది.ప్రాంతీయ పార్టీల మధ్య పోటీ కంటే.. కూటమిల మధ్య గట్టి ఫైట్ నెలకొనే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో జగన్, కెసిఆర్ ఏదో ఒక కూటమిలో చేరక తప్పని పరిస్థితి. ఇప్పటికే ఏపీలో ఎన్డీఏ కూటమిలో టిడిపి, బిజెపి, జనసేన ఉన్నాయి. ఇండియా కూటమిలో కాంగ్రెస్, వామపక్షాలు కొనసాగుతున్నాయి. ఏ కూటమిలో చేరకుండా వైసిపి ఉంది. రెండు రాష్ట్రాల్లో కూడా బలమైన ప్రతిపక్ష పార్టీ నేతలు రాకుండా దుమ్మా కొడుతున్నారు. కేసీఆర్ దాదాపు 40 అసెంబ్లీ సీట్లు గెలుచుకొని బలమైన ప్రతిపక్ష నేతగా కనిపిస్తున్నారు కానీ ఆయన అసెంబ్లీలోకి వెళ్లిన సందర్భమే లేదు మరోవైపు జగన్ ప్రతిపక్ష హోదా లేదు అయినా ఆయన వెళ్లొచ్చు. కానీ ఆయన కూడా అసెంబ్లీని పూర్తిగా బహిష్కరించారు. బయట మాట్లాడుతున్నారు తప్ప అసెంబ్లీలోకి వెళ్లి ఎన్నికల ప్రచార సమయంలో మాట్లాడినట్లు మాట్లాడలేకపోతున్నారు.ఏపీలో బడ్జెట్ సమావేశాలు మొదలైన రోజు జగన్ ఢిల్లీకి వెళ్లి ధర్నా చేశారు. మరోవైపు కేసీఆర్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లిపోయారు. తర్వాత మీడియా సమావేశంలో కొద్దిసేపు మాట్లాడారు అనంతరం ఆయన కనిపించిన దాఖలాలు లేవు. సాధారణంగా ప్రతిపక్ష హోదా అంటే ఒక క్యాబినెట్ మినిస్టర్ తో సమానమైనది. దానిని సద్వినియోగం చేసుకుంటూ ప్రజల కోసం మాట్లాడాల్సిన అవసరం ఉంది. కానీ ఓడిపోతే ఇక తమకు రాష్ట్రంతో సంబంధం లేనట్లు, అధికారంలో ఉన్న వాళ్ళు ఏం చేసినా తమకు అనవసరం క్వశ్చన్ చేయమన్నట్లు కెసిఆర్ ప్రవర్తిస్తున్నారు. మరోవైపు జగన్ కూడా అలాగే తయారయ్యారు. కెసిఆర్ జగన్ పార్టీల నుంచి వెళ్ళిపోతున్నావా ఎమ్మెల్యేల సంఖ్య కూడా పెరుగుతోంది. కేసీఆర్ వారిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు జగన్ మాత్రం ఆ ప్రయత్నాలు చేయనట్లే కనిపిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు తమ ఎమ్మెల్యేలతో జగన్ గాని కెసిఆర్ గానీ మాట్లాడలేదు ఇప్పుడు ఉండమంటే వాళ్ళు ఉంటారా అనేది కూడా ప్రశ్నార్థకమే. ఏపీలో వైసీపీ పట్ల సానుభూతి ఇప్పట్లో కనిపించేలాగా కనిపించడం లేదు. కెసిఆర్ పరిస్థితి కూడా అలానే తయారయింది. లోక్‌సభ ఎన్నికల్లో అతను ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయారు. రైతుబంధు, దళిత బంధు, బీసీ బంధు అంటూ కేవలం కొన్ని వర్గాల ప్రజలకు మాత్రమే డబ్బులు ఇస్తానని కేసీఆర్ అంటున్నారు కానీ పేద ప్రజలకు మాత్రం ఇల్లు కట్టిస్తానని చెప్పడం లేదు. కొన్ని హామీలను నెరవేర్చిన కీలకమైన హామీలను నెరవేర్చడంలో ఫెయిల్ అయ్యారు. అందుకే ప్రజల్లో ఆగ్రహం ఎక్కువగా ఉంది. మరి వచ్చేసారి కాంగ్రెస్ కంటే కేసీఆర్ ఏ బెటర్ అని ఒక నిర్ణయానికి వస్తారా లేదా అనేది తెలియాల్సి ఉంది.తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇండియా కూటమికి చెందినది. బిజెపి ఎన్డీఏ కు నేతృత్వం వహిస్తోంది. దీంతో అక్కడ ఏ కూటమికి చెందినది కేసీఆర్ పార్టీ2029లో జమిలి ఎన్నికలు జరిగితే.. జగన్ ఇప్పటినుంచే కార్యాచరణ ప్రారంభించాలి.ఎన్డీఏలో టిడిపి, జనసేనలు బలమైన పక్షాలు కావడంతో ఆ కూటమిలో చేరేందుకు జగన్ కు చాన్స్ లేదు. అందుకే ఆయనకు ఏకైక ఆప్షన్ ఇండియా కూటమి. కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి ఎన్నికలకు సిద్ధం కావడమే ఆయన ముందున్న కర్తవ్యం. కెసిఆర్ ది మరీ విచిత్ర పరిస్థితి.

# ఆపరేటర్ల తప్పిదం.. అర్హులకు శాపం




రఘునాథపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలలోని గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు అర్హులందరికీ అందడం లేదు. ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే క్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు చేసిన తప్పిదాలు కొంత మంది అర్హుల పాలిట శాపంగా మారుతున్నాయి. నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు ఉన్నప్పటికీ జిల్లాలో 200 యూనిట్‌లలోపు విద్యుత్‌ను ఉచితంగా పొందే అవకాశంతో పాటు మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను పొందే అవకాశాన్ని చాలా మంది కోల్పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు గ్రామాలలో ప్రజాపాలన సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. అయితే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో అనేక తప్పులు దొర్లాయి. మీటర్ సర్వీస్ నంబర్లు, గ్యాస్ ఐడీ నంబర్లు ఎంట్రీ చేయడంలో అనేక తప్పిదాలు జరిగాయి. వాటిని సవరించేందుకు అవకాశం లేకపోవడంతో అర్హులైన కొందరికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజాపాలన దరఖాస్తులను సవరించేందుకు ప్రభుత్వం ఇటీవల అవకాశం కల్పించింది. మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వాటిని సవరించే కార్యక్రమం చేపట్టింది. అయితే సవరణలో కొన్ని పొరపాట్లను మాత్రమే సవరించుకునేందుకు అవకాశం ఉంది. ఎక్కువ శాతం దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. ఫలితంగా అనేక మందికి సంక్షేమ పథకాలు అందడం లేదు. సమస్య పరిష్కారానికి ఎడిట్ ఆప్షన్ ఇవ్వడం ఒక్కటే మార్గమని సిబ్బంది అంటున్నారు. కేవలం మిస్ మ్యాచ్‌డ్ అని ఉన్న వాటికి ఎడిట్ ఆప్షన్ ఉండడంతో వాటిని సరి చేస్తున్నారు. అంటే ఒక దరఖాస్తుదారుడి నెంబరుకు ఇంకొక దరఖాస్తుదారుడి నెంబరు నమోదు చేయడం అన్న మాట. కానీ ఇలా లేనివాటిని కూడా సరి చేసేందుకు ఎడిట్ ఆప్షన్ తప్పనిసరి అంటున్నారు. ఎడిట్ ఆప్షన్ లేక తప్పులు సరి చేయకపోవడంతో సమస్య పరిష్కారం కోసం అర్హులందరూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని చెబుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసేందుకు ప్రైవేటు వ్యక్తులను నియమించి ఒక్కో దరఖాస్తుకు ఇంత అని చెప్పడంతో ఎక్కువ దరఖాస్తులు ఎంట్రీ చేసేందుకు పోటీ పడ్డ క్రమంలో అన్ని తప్పులు దొర్లినట్లుగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తులో గృహజ్యోతికి, మహాలక్ష్మికి టిక్ మార్క్ చేసినా..కొందరికి డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు నాట్ అప్లై అని నమోదు చేశారు. దీంతో అర్హులైన వారికి అన్యాయం జరుగుతోంది. ప్రజాపాలన దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సవరించుకునేందుకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. గృహజ్యోతి దరఖాస్తుదారుల సమస్యను పరిష్కరించడానికి ఎట్టకేలకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చారు. దీంతో చాలా వరకు ఆన్‌లైన్ ప్రక్రియలో జరిగిన తప్పులను సవరించే అవకాశం లభించింది. ఫలితంగా దాదాపు 90 శాతం మంది వినియోగదారులకు జీరో కరెంట్ బిల్ వస్తోంది. కాని మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500లకే గ్యాస్ సిలిండర్ దరఖాస్తుదారులకు మాత్రం ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదు. ప్రజాపాలనలో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నపుడు ఇచ్చిన గ్యాస్ ఏజెన్సీకి చెందిన ఏడు అంకెల నెంబర్‌ను మాత్రమే ఇచ్చారు..ఆన్‌లైన్ నమోదులో జరిగిన పొరపాటుతో కొందరు లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ రాకపోవడంతో గ్యాస్ ఏజెన్సీకి చెందిన 13 అంకెల నెంబర్‌ను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసినప్పటికీ నాట్ మ్యాచింగ్ అని వస్తోంది. దీంతో గ్యాస్ సబ్సిడీ పొందేందుకు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన లబ్దిదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేటప్పుడు దొర్లిన తప్పులను సవరించేందుకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వకపోవడం వల్ల తప్పులను సరిచేయలేకపోతున్నాం. గృహలక్ష్మి దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదులో జరిగిన తప్పులను ఎడిట్ ఆప్షన్ ద్వారా చాలా వరకు సవరించగలిగాం. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ దరఖాస్తులు కొన్ని నాట్ అప్లై అని నమోదు చేయడంతో దొర్లిన తప్పులను సవరించడానికి సరైన ఎడిట్ ఆప్షన్‌ను ఇప్పటివరకు ఇవ్వకపోవడంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సబ్సిడీ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. సరైన ఎడిట్ ఆప్షన్ వస్తేనే తప్పులను సరి చేసేందుకు వీలుంటుంది.

# రామగుండంలో కంపుకొడుతున్న కాలనీలు



కోల్‌సిటీ, ఆగస్టు 5 : రామగుండం 'నగర' పాలన అంతా అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలోని ఏకైక నగ ర పాలక సంస్థ అయిన రామగుండంలో మున్సిపల్ సేవలు ప్రజలకు ఆశించిన మేర అందడం లేదు. పారిశుధ్యం పూర్తిగా లోపించింది. కాలనీలు కంపుకొ డుతున్నాయి. పారిశుధ్య విభాగంలో 448మంది పనిచేస్తున్నా సేవలు వినియోగించుకోలేని దుస్థితి కార్పొరేషన్‌లో నెలకొన్నది. వర్షాకాల సీజన్‌లో పారిశు ధ్యమే ప్రధానం కాగా రామగుండంలో మాత్రం పరి స్థితులు భిన్నంగా ఉన్నాయి. పారిశు ధ్య నిర్వహణ లేక రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ నీరు నిల్వ ఉం టోంది. ఇళ్ల మధ్యలో వర్షపు నీరు చెరువులను తలపి స్తున్నాయి. పాలనపై కమిషనర్ పూర్తిస్థాయి పట్టు సాధించకపోవడంతో విభాగాల్లో ఎవరికి వారుగా వ్యవహారాలు సాగిస్తున్నారు. తాను బదిలీ యత్నాల్లో ఉన్నానంటూ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లకు ఆయన సంకేతాలు ఇవ్వడంతో దాని ప్రభావం పాల నపై కనబడుతుంది. సాధారణంగా వర్షాకాల సీజన్ లో పారిశుధ్య సేవలను సమర్థవంతంగా వినియోగిం చుకోవాల్సి ఉంటుంది. నగర పాలక పరిధిలో 50 శాతం ప్రాంతాల్లోనే మున్సిపల్ సేవలందిస్తుండగా మిగతా ప్రాంతాల్లో సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌టీ పీసీ, జెన్‌కో సేవలందిస్తున్నాయి. ప్రతి వర్షాకాలంలో ముందస్తుగా ప్రత్యేక టీములను ఏర్పాటు చేసేవారు. కార్పొరేషన్ సిబ్బందితోనే డ్రైన్ల పూడిక తీత, నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పైగా వర్షాకాల సీజన్‌లో అవుట్ సోర్సింగ్ సిబ్బందిలో చేర్పులు మార్పులు చేశారు. ఆ జాబితాను కూడా మూడు సార్లు తయారు చేసి మూడుసార్లు మార్చారు. కీలకమైన సమయంలో ఏరి యాలపై అవగాహన ఉ న్న వారిని మార్చడమేమిటం టూ కార్పొరేటర్లు అడ్డు చెబుతున్నారు. కనీస సిబ్బం దిని సమకూర్చడం చేతకాక మార్పులు చేర్పులు ఏమిటంటే సోషల్ మీడియా వేదికగా విరుచుకు పడుతున్నారు. రామగుండం నగరపాలక సంస్థలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కీలకమైన ఇంజనీరింగ్ విభాగం ప్రహసనంగా మారింది. ఎక్కడ ఏ పనులు జరుగాయి,

# కోరలు చాచిన ఈ నిరుద్యోగం కనిపించలేదా?




జూలై 23, 2024న గౌరవనీయ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్ సమర్పించారు. మరుసటి రోజు పార్లమెంటు ఉభయ సభలలో బడ్జెట్‌పై చర్చ జరిగింది. ఆ చర్చకు జూలై 30న లోక్‌సభలోను, జూలై 31న రాజ్యసభలోను ఆర్థిక మంత్రి సమాధానమిచ్చారు. ఆర్థిక మంత్రి వాదన స్థూలంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంది: (1) ప్రతి మంత్రిత్వ శాఖ వ్యయాల కింద ప్రభుత్వం నిధులను మరింత మిక్కుటంగా ఖర్చు పెడుతోంది. వ్యయ పరిమాణం సుపరిపాలనకు కొలమానం అని సీతారామన్ ఉద్ఘాటించారు. పర్యవసానంగా అన్ని వర్గాల ప్రజలు 'అభివృద్ధి', 'సంక్షేమం'తో విశేషంగా లబ్ధి పొందుతున్నారు. తన వాదనను బలపరచుకోవడానికి ఆర్థిక మంత్రి కొన్ని అంకెలను వెల్లడించారు : 2013-14 (యూపీఏ ప్రభుత్వ చివరి సంవత్సరం)లో ఎంత ఖర్చు పెట్టిందిబీ 2019-20, 2023-24 (ఎన్డీఏ రెండో ప్రభుత్వ మొదటి, చివరి సంవత్సరాలు)లో ఎంత ఖర్చు పెట్టిందీ, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎంత ఖర్చు పెట్టనున్నదీ ఆమె తెలిపారు. ఆ అంకెలు, సంవత్సరం సంవత్సరానికీ ప్రభుత్వం చేస్తున్న వ్యయం ఎంతగా పెరిగిపోతున్నదో వివరించాయి. ఉదాహరణకు వ్యవసాయ రంగంలో చేసిన వ్యయాన్ని చూద్దాం. యూపీఏ ప్రభుత్వ చివరి సంవత్సరంలో వ్యవసాయరంగానికి రూ.0.30 లక్షల కోట్లు కేటాయించగా, ఆ కేటాయింపులు రూ.1.52 లక్షల కోట్లు అని ఆమె పేర్కొన్నారు. ఈ మొత్తం, గత ఆర్థిక సంవత్సరం (2023-24) కేటాయింపుల కంటే రూ.8000 కోట్లు ఎక్కువ అని ఆర్థిక మంత్రి అన్నారు. 'వ్యవసాయ రంగానికి కేటాయింపులు మేము ఏటికేడాది పెంచుతూ పోయామే కాని ఎన్నడూ తగ్గించలేదని' నిర్మలా సీతారామన్ అన్నారు. అయితే గమనార్హమైన విషయమేమిటంటే ఆ అంకెలు ప్రస్తుత ధరలలో ఉన్నాయి కాని స్థిరమైన ధరలలో లేవు. మొత్తం వ్యయంలో లేదా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ఆ వ్యయ పెరుగుదల ఎన్నో వంతుగా ఉన్నదనేదే చాలా ముఖ్యం. ఈ ఉపయుక్త విషయాలను ఆర్థిక మంత్రి వెల్లడించనే లేదు. మరో ముఖ్యమైన విషయమేమిటంటే 2023-24 ఆర్థిక సంవత్సరంలో వివిధ మంత్రిత్వ శాఖలు కేటాయించిన నిధులను పూర్తిగా ఖర్చు పెట్టలేదు. ఎందుకు ఖర్చు పెట్టలేదో ఆర్థిక మంత్రి వివరించలేదు.

(2) నిరుద్యోగిత సమస్య లేనే లేదు. 'సక్షామ్, స్వతంత్ర, సమర్థ్ ' (అర్హత, స్వతంత్రత, సామర్థ్యం) అనేది తమ ప్రభుత్వ విధానమని ఆర్థిక మంత్రి చెప్పారు. దేశంలో నిరుద్యోగిత 3.2 శాతానికి తగ్గిపోయినట్టు పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే వెల్లడించిందని ఆమె పేర్కొన్నారు. 2014-2023 సంవత్సరాల మధ్య దేశంలో 125 మిలియన్ ఉద్యోగాలను సృష్టించినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిశోధక విభాగం నివేదిక వెల్లడించిందని ఆర్థిక మంత్రి తెలిపారు. అవి రెండూ ప్రభుత్వ నివేదికలే. సిఎమ్ఐఇ డేటా ఆ నివేదికల వివరాలకు విరుద్ధంగా ఉన్నది. దేశంలో నిరుద్యోగిత ప్రస్తుతం 9.2 శాతంగా ఉన్నదని ఆ ప్రతిష్ఠాత్మక పరిశోధనా సంస్థ పేర్కొంది. భారత్‌లో నిరుద్యోగులుగా ఉన్న వారిలో 83 శాతం మంది యువజనులేనని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) వెల్లడించింది. మరి కేవలం కొన్ని వందల లేదా కొన్ని వేల ఉద్యోగాలకు లక్షలాది అభ్యర్థులు ఎందుకు పోటీపడుతున్నారు? ఈ ప్రశ్నకు ఆర్థిక మంత్రి సమాధానమివ్వలేదు. ఈ ఉదంతాలను చూడండి. బీజేపీ పాలనలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌కు పరీక్ష నిర్వహించారు. 60,244 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఆ పరీక్షకు (16 లక్షల మంది మహిళలతో సహా) 48 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉత్తరప్రదేశ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ భర్తీ చేయనున్న 7500 ప్రభుత్వోద్యోగాలకు 24,74,030 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిరుద్యోగిత నిజంగా తగ్గిపోతే భర్తీ చేయాల్సిన ఉద్యోగాల సంఖ్యకు, దరఖాస్తుదారుల/అభ్యర్థుల సంఖ్యకు మధ్య అంత పెద్ద తేడా ఎలా ఉన్నది? ఆ తేడా పోలీసు ఉద్యోగాల విషయంలో 1:80గా, క్లర్కుల విషయంలో 1:329గా ఎందుకు ఉన్నది! పోలీసు శాఖలో అతి తక్కువ స్థాయి ఉద్యోగానికి ఇంజనీర్లు, మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్లు, లాయర్లు, పోస్ట్-గ్రాడ్యుయేట్లు సైతం ఎందుకు దరఖాస్తు చేశారు? నిరుద్యోగిత ఎంత తీవ్రంగా ఉన్నదో తెలుసుకోవాలంటే ప్రధానమంత్రి, ఇతర కేంద్ర మంత్రులు పట్టణాలు, నగరాల వీథులలో తిరగాలి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన సంచారాన్ని మదురై (ఆమె జన్మ స్థలం)లో ప్రారంభించి విల్లుపురం (ఆమె పాఠశాల విద్యాభ్యాసం జరిగిన పట్టణం)కు వెళ్లి, ఆ తరువాత తిరుచిరాపల్లి (కళాశాల చదువుకు ఆమె వెళ్లిన నగరం)లో ముగించాలి.

(3) యూపీఏ ప్రభుత్వాల హయాంలో కంటే మా ప్రభుత్వ హయాంలో ద్రవ్యోల్బణం రేటు మెరుగ్గా ఉన్నదని ఆర్థిక మంత్రి అన్నారు. నిర్మలా సీతారామన్ ఇంకా ఇలా అన్నారు: 'హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాలలో చదువుకున్న నాయకులు యూపీఏ ప్రభుత్వాల హయాంలో ఆర్థిక మంత్రిత్వ శాఖను నిర్వహించారు. 2009%-%13 సంవత్సరాల మధ్య ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయికి పెరగడానికి దారితీసిన ఉద్దీపన పథకాలను ఎప్పుడు, ఎలా ఉపసంహరించాలో వారికి తెలియలేదు'. ఆర్థిక మంత్రి అభియోగం సాంకేతికంగా సరైనదే. అయితే అది ఔచిత్యం లోపించిన ఆరోపణ. ఎందుకని? ఇప్పుడు దేశ ప్రజలు యూపీఏ ప్రభుత్వ పాలనలో నివశించడం లేదు. నరేంద్ర మోదీ రెండో ప్రభుత్వ పాలనలో నివశిస్తున్నారు. టొమాటో, ఉల్లిపాయలు, పొటాటో ధరలు ఏటేటా వరుసగా 30 శాతం, 46 శాతం, 59 శాతం చొప్పున పెరుగుతున్న కాలంలో నివశిస్తున్నారు. వేతన ప్రేరిత ద్రవ్యోల్బణం (వేజ్ పుష్ ఇన్‌ఫ్లేషన్) 3.4 శాతం, వినియోగ దారు ధరల ద్రవ్యోల్బణం (కన్స్యూమర్ ప్రైస్ ఇన్‌ఫ్లేషన్) 5.1 శాతం, ఆహార ద్రవ్యోల్బణం 9.4 శాతంగా ఉన్న కాలంలో నివశిస్తున్నారు. గత ఆరు సంవత్సరాలుగా సకల కార్మికుల వేతనాల పెరుగుదల స్తంభించిన కాలంలో వారు నివశిస్తున్నారు. గత వేసవిలో జరిగిన సార్వత్రక ఎన్నికలలో ప్రజలు యూపీఏ ప్రభుత్వ కాలంలోని ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా కాకుండా, నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనలో ద్రవ్యోల్బణ పెరుగుదలకు వ్యతిరేకంగా ఓటు వేశారు. ద్రవ్యోల్బణ భారాన్ని తగ్గించేందుకు, పూర్వ నిర్ధారిత ధరల (అడ్మినిస్ట్రేడ్ ప్రైసెస్) తగ్గింపునకు, పన్నులు, సెస్‌ల తగ్గింపునకు, కనీస వేతనాల పెరుగుదలకు ఆర్థిక మంత్రి ఎటువంటి ప్రతిపాదనలు చేయలేదు. ద్రవ్యోల్బణంపై ప్రధాన ఆర్థిక సలహాదారు అభిప్రాయాన్ని ఆమె ఉటంకించారు. అది: 'భారతదేశ ద్రవ్యోల్బణం తక్కువస్థాయిలో స్థిరంగా కొనసాగుతూ నాలుగు శాతం నిర్దేశిత లక్ష్యం దిశగా సాగుతోంది'. ఈ ఉటంకింపుతో ద్రవ్యోల్బణంపై చర్చకు ఆమె తన సమాధానాన్ని ముగించారు. ఇంతకూ ఒక ప్రాసంగిక ప్రశ్నకు ఆర్థిక మంత్రి సమాధానమివ్వనే లేదు. ఇదీ ఆ ప్రశ్న: ద్రవ్యోల్బణం నియంత్రణ అంత మెరుగ్గా ఉంటే, రిజర్వ్ బ్యాంక్ గత 13 నెలలుగా బ్యాంక్ రేటును 6.5 శాతంగా మాత్రమే ఎందుకు ఉంచుతోంది? 2024లో సైతం దానిని తగ్గించే అవకాశాలు ఎందుకు కన్పించడం లేదు? 2024-25 కేంద్ర బడ్జెట్‌పై ప్రజలు పెదవి విరిచారు. సగటు పౌరులు దానిపట్ల ఉదాసీనంగా ఉన్నారు. మోదీ ప్రభుత్వాన్ని సమర్థించే వారు సైతం సమాజంలోని వివిధ వర్గాలకు అది సమకూర్చే శ్రేయస్సుపై సంశయాలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అది చేసే దోహదమేమిటో వారికి అర్థం కావడం లేదు. ఎవరూ ఉత్సాహంగా లేరు. ఒక్క ఆర్థిక మంత్రి మాత్రమే తన బడ్జెట్ విషయంలో అమితోత్సాహంగా ఉన్నారు. సామాన్యుల ఉదాసీనతను ఆమె గ్రహించడం లేదు. సరే, నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టినప్పుడు చాలా మందితో పాటు నాకూ కలిగిన సంశయాలు, సంకోచాలు బడ్జెట్‌పై చర్చకు ఆమె సమాధానం ముగించిన తరువాత కూడా అదే విధంగా ఉండిపోయాయి.

# టీడీపీకి దగ్గరవుతున్న వామపక్షాలు

**విజయవాడ :** చంద్రబాబు నాయుడు పూర్వాశ్రమం కాంగ్రెస్ పార్టీ. ఆ పార్టీ ద్వారా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1979 ఎన్నికల్లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా కూడా వ్యవహరించారు. అటు తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరారు. అంచలంచెలుగా ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. టిడిపి అధినేతగా సుదీర్ఘకాలం వ్యవహరిస్తూ వచ్చారు. అయితే ఈ కాంగ్రెస్ ద్వారా అయితే రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు.. అదే పార్టీని విభేదించారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీకి చంద్రబాబు రాజకీయ ప్రత్యర్థిగా మారారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో ఇండియా కూటమిగా ఉంది. వ్యతిరేక కూటమి అయిన ఎన్డీఏలో చంద్రబాబు ఉన్నారు. అయినా సరే కాంగ్రెస్ పార్టీలో చంద్రబాబు పట్ల సాఫ్ట్ కార్నర్ కనిపిస్తోంది. దీనికి జగన్ వైఖరి కారణం. గత ఐదేళ్లుగా జగన్ అనుసరించిన విధానాలతో.. చంద్రబాబు బెటర్ అన్న ఆలోచనలోకి వచ్చారు కాంగ్రెస్ నేతలు. ఏపీలో ప్రస్తుతం కూటమిని వ్యతిరేకిస్తోంది కేవలం వైసీపీ మాత్రమే. మిగిలిన అన్ని రాజకీయ పక్షాలు సానుకూలంగానే ఉన్నాయి. ఇది ముమ్మాటికీ చంద్రబాబుకు కలిసొచ్చే కాలమే. గతంలో ప్రజల్లోనే చంద్రబాబుపై ఒక రకమైన వ్యతిరేక భావన ఉండేది. కానీ ఐదేళ్ల వైసిపి పాలన చూసేసరికి చంద్రబాబు లో ఉన్న పాలనా దక్షత బయటపడింది. మిగతా రాజకీయ పార్టీల్లో సైతం చంద్రబాబు పట్ల ఉన్న అభిప్రాయం మారింది. వామపక్షాలు టిడిపి కూటమి పాలన సవ్యంగా సాగాలని కోరుకుంటున్నాయి. నేరుగా ఆ పార్టీల నేతలు చంద్రబాబును కలిసి అభినందనలు కూడా తెలిపారు. సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చారు. గత ఐదేళ్లుగా జగన్ తమను దగ్గరకు కూడా రానివ్వలేని విషయాన్ని గుర్తు చేసుకున్నారు. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లోనే తమను పిలిచి వినతి పత్రాలు తీసుకోవడానికి వారు ఆహ్వానిస్తున్నారు. పిసిసి మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరారెడ్డి చంద్రబాబు పాలనను మెచ్చుకున్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్లో రఘువీరారెడ్డి సీనియర్ మంత్రి. చంద్రబాబును వ్యతిరేకించే నేత కూడా. చిరకాల ప్రత్యర్థిగా కూడా నిలిచారు. అటువంటిదిసీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గ మడకశిరలో పర్యటించగా అభినందనలు తెలిపారు. ఎటువంటి ఆర్భాటం చేయకుండా, జన సమీకరణ లేకుండా సమావేశం నిర్వహించారని మెచ్చుకున్నారు. మడకశిర అభివృద్ధికి అవసరమైన శక్తియుక్తులను చంద్రబాబుకు ఆ భగవంతుడు కల్పించాలని కోరారు రఘువీరారెడ్డి. ఆయనచేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయిచిరకాలం చంద్రబాబును వ్యతిరేకించింది కాంగ్రెస్ పార్టీ. కానీ తొలిసారిగా 2018లో కాంగ్రెస్ పార్టీతో జత కలిసింది టిడిపి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసి పోటీ చేశాయి. కానీ ప్రతికూల ఫలితాలు వచ్చాయి. బిజెపితో విభేదించి 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ కు స్నేహ హస్తం అందించారు చంద్రబాబు. కానీ ఆ ప్రయోగం ఫలించలేదు. వికటించింది కూడా. అటు తరువాత కాంగ్రెస్ నుంచి జారుకున్నారు చంద్రబాబు. ఏపీలో బిజెపితో పొత్తు పెట్టుకున్నారు. కేంద్రంలో ఎన్డీఏలో చేరారు. అయినా సరే కాంగ్రెస్ పార్టీ చంద్రబాబు పట్ల వ్యతిరేక భావన ఏర్పరచుకోలేదు. చంద్రబాబు విషయంలో ఈ తరహా సానుకూల వాతావరణం రావడానికి మాత్రం ముమ్మాటికి జగనే కారణం. కనీసం ఒక రాజకీయ పార్టీలుగా కాంగ్రెస్ తో పాటు వామపక్షాలను గౌరవించలేదు. 2014లోప్రతిపక్షంలో ఉన్న వైసిపి.. తోటిపక్షాలుగా కాంగ్రెస్, వామపక్షాలను కలుపుకు వెళ్లే ప్రయత్నం చేయలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత సైతం.. గౌరవించిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ పార్టీని పురుగు కంటే హీనంగా చూశారు. వామపక్షాల ఉద్యమాలను అణచివేశారు. అందుకే ఇప్పుడు తమకు ప్రత్యర్థి అయిన బిజెపి కూటమిలో ఉన్నా.. చంద్రబాబును ఆ రెండు పార్టీలు గౌరవించడానికి అదే కారణం.

# ట్రాప్ లో వైసీపీ



**విజయవాడ :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని చంద్రబాబు ఎందుకు చెబుతున్నట్టు? క్లిష్ట పరిస్థితుల్లో పథకాలు అమలు చేయలేమని అనుమానం ఎందుకు వ్యక్తం చేస్తున్నట్టు? దీని వెనుక వ్యూహం ఉందా? లేకుంటే వైసీపీని ఇరికించే ప్రయత్నమా? మరి లేకుంటే ట్రాప్ చేస్తున్నట్టా? పొలిటికల్ సర్కిల్లో దీనిపైనే చర్చ నడుస్తోంది. ఎన్నికల్లో చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారు. వాటికి మించి కొన్ని రకాల హామీలు ఇచ్చారు. కానీ ఇంతవరకు అమలు చేయలేకపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులు గడుస్తున్నా సంక్షేమ పథకాల విషయంలో ఆశించిన స్థాయిలో అడుగులు వేయలేకపోతున్నారు. పనిలో పనిగా వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలపై శ్వేత పత్రాలు విడుదల చేస్తున్నారు. అంతటితో ఆగకుండా.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వైసిపి దారుణంగా మార్చిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే దీనినే వైసిపి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తోంది. చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోతున్నారని పోస్టులు పెడుతోంది. అయితే ఈ క్రమంలో వైసిపి చంద్రబాబు ట్రాప్ లో పడినట్లు తెలుస్తోంది. పథకాలు అమలు చేయకపోవడంపై విస్తృత ప్రచారం జరుగుతోంది. సరిగ్గా ఇదే సమయంలో కొన్ని పథకాలను అమలు చేసి వైసిపిని ఇరుకున పెట్టాలని చంద్రబాబు చూస్తున్నారు. అయితే అది తెలియని వైసీపీశ్రేణులు ప్రచారం చేసుకుంటున్నాయి. అయితే చంద్రబాబు పథకాలు అమలు చేయకపోవడం కంటే.. వైసిపి హయాంలో ఆర్థిక పరిస్థితి దిగజారింది అన్న అంశమే ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. ఇది తప్పకుండా మైనస్ చేస్తుందని.. చంద్రబాబు ఆడుతున్న మైండ్ గేమ్ ను అర్థం చేసుకుంటే వైసీపీకే నష్టమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సామాజిక పింఛన్ మొత్తాన్ని పెంచి అమలు చేయగలిగారు చంద్రబాబు. వృద్ధాప్య వితంతు పింఛన్ ను 3000 నుంచి 4 వేల రూపాయలకు పెంచగలిగారు. దివ్యాంగులకు సంబంధించి 6 వేలకు పెంచారు. అనారోగ్యం గురైన వారు, మంచానికి పరిమితమైన వారి విషయంలో సైతం పింఛన్ అమాంతం పెంచి అందించగలిగారు. వైసిపి రాష్ట్రాన్ని ఆర్థికంగా దిగజార్చినా తాను అమలు చేసిన విషయాన్ని ఇప్పుడు చంద్రబాబు ప్రస్తావిస్తున్నారు. వరుసగా రెండో నెల సైతం పింఛన్లు విజయవంతంగా అందించి ప్రజల్లో వ్యతిరేకత లేకుండా చేసుకోగలిగారు. అన్న క్యాంటీన్లు ప్రారంభించేందుకు చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. ఆగస్టు 15న రాష్ట్రవ్యాప్తంగా 100 క్యాంటీన్లు ప్రారంభం కానున్నాయి. వీటికి సంబంధించి ఏర్పాట్లు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. కచ్చితంగా ఆగస్టు 15 నాటి నుంచి అన్న క్యాంటీన్లలో భోజనాలు, అల్పాహారాలు ప్రారంభం కానున్నాయి. దీనిని కూడా ప్రచారాస్త్రంగా మార్చుకోనున్నారు చంద్రబాబు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా తాను అమలు చేసి చూపించానని చంద్రబాబు చెప్పుకొనున్నారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం ప్రారంభించేందుకు కసరత్తు పూర్తయింది. ప్రతినెల 250 కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు చంద్రబాబు. అయితే ఆధార్ కార్డుతో ప్రయాణానికి వీలు కల్పించాలా? లేకుంటే ప్రత్యేక కార్డులు జారీ చేయాలా? అన్నది నిర్ణయించనున్నారు. దీనిని సైతం చంద్రబాబు ప్రచారానికి వాడుకునే అవకాశం ఉంది. జగన్ ఎన్ని రకాలుగా రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీసినా.. ఈ రాష్ట్ర ప్రజల కోసం తాను ఈ పథకాలను అమలు చేస్తున్నానని చెప్పుకునే అవకాశం ఉంది. ఇది తెలియని వైసిపి.. చంద్రబాబు పథకాలు అమలు చేయడం లేదని ప్రచారం చేయడం ద్వారా.. చంద్రబాబు ట్రాప్ లో పడినట్లు అయింది. దీనిని వైసిపి ఎలా అధిగమిస్తుందో చూడాలి.

# 40 రోజులు 4 సార్లు



**కడప :** జగన్ చర్యలు వైసీపీ శ్రేణులకు అంతుపట్టడం లేదు. ఆయన పట్టుమని తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఉండడం లేదు. తరచూ బెంగుళూరు వెళ్లిపోతున్నారు. ఆ పర్యటనలకు సంబంధించి షెడ్యూల్ సైతం బయటకు రావడం లేదు. అక్కడకు ఏం పని మీద వెళ్తున్నారో కూడా చెప్పడం లేదు. గత 40 రోజుల్లో నాలుగు సార్లు బెంగళూరు వెళ్లడం హాట్ టాపిక్ గా మారింది. ఈ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయింది. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. ఈ తరుణంలో స్పీకర్ఎంపికకు కూడా జగన్ హాజరు కాలేదు. అదేరోజు బెంగళూరు వెళ్ళిపోయారు. సాధారణంగా స్పీకర్ ఎంపికలో ప్రతిపక్షానిదే కీలక పాత్ర. కానీ స్పీకర్ గా ఎంపికైన అయ్యన్నపాత్రుడు వైసీపీని ఉద్దేశించి దారుణంగా మాట్లాడారంటూ ఆక్షేపిస్తూ అదేరోజు బెంగళూరు వెళ్ళిపోయారు జగన్. అదే స్పీకర్ అయ్యన్నపాత్రుడు కి తనకు ప్రతిపక్ష హోదా కేటాయించాలని కోరుతూ లేఖ రాశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే పులివెందుల వెళ్లారు జగన్. అక్కడ నుంచి బెంగళూరు వెళ్ళిపోయారు. ఈ నలభై రోజుల వ్యవధిలో నాలుగు సార్లు బెంగళూరు వెళ్లడం కొత్త అనుమానాలకు తావిస్తోంది. ఇందులో పొలిటికల్ అజెండా ఏదైనా దాగి ఉందా? అని సొంత పార్టీ శ్రేణులే అనుమానించే దాకా పరిస్థితి వచ్చింది. రకరకాల కారణాలు చెబుతూ ఇప్పటివరకు జగన్ బెంగళూరు బాట పట్టారు. ఇప్పుడు మాత్రం కారణం చెప్పకుండానే వెళ్తున్నారు. దీనిపై రకరకాల ఊహాగానాలు రేగుతున్నాయి. ఇటీవలే బెంగళూరు నుంచి తాడేపల్లి కి వచ్చారు జగన్. పాస్ పోర్ట్ రెన్యువల్ చేయించుకోవాలని చెప్పి వచ్చారు. ఆ పని అయిపోయిన వెంటనే తిరిగి బెంగళూరు పయనమయ్యారు. బెంగళూరులో జగన్ కు ప్యాలెస్ ఉంది. యలహంక ప్రాంతంలో భారీ భవంతిని నిర్మించారు. బెంగళూరు వెళ్తే అక్కడే బస చేస్తున్నారు. కానీ అక్కడ జగన్ ఎవరిని కలుస్తున్నారు? ఏం చర్చలు జరుపుతున్నారు? అన్నది మాత్రం బయటకు చెప్పడం లేదుఅయితే జగన్ బెంగుళూరు వెళుతున్నది పక్కా పొలిటికల్ అజెండా తోనే అని ప్రచారం అయితే జరుగుతోంది. ముఖ్యంగా అక్కడ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. తన సన్నిహితుడైన డీకే శివకుమార్ డిప్యూటీ సీఎం గా ఉన్నారు. ఆయన ద్వారా కొన్ని విషయాల్లో లాబీయింగ్ చేసుకునేందుకే జగన్ తరచూ బెంగళూరు వెళుతున్నారని ప్రచారం మాత్రం జరుగుతోంది. అయితే దీనిపై డీకే శివకుమార్ ప్రత్యేక ప్రకటన చేయాల్సి వచ్చింది. తనను ఇంతవరకు జగన్ కలవలేదని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలకు దిగుతామని కూడా హెచ్చరించారు. దీంతో ఈ ప్రచారానికి ఫుల్ స్టాప్ పడింది. జగన్ ఇండియా కూటమికి దగ్గరవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మొన్న ఢిల్లీలో జరిగిన ధర్నాకు కాంగ్రెస్ మినహాయించి అన్ని ఇండియా కూటమి పార్టీలు హాజరయ్యాయి. అటు కాంగ్రెస్ కు సైతం జగన్ దగ్గర అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు తెలంగాణ కాకుండా కర్ణాటకకే జగన్ క్యూ కట్టడం కూడా కొత్త అనుమానాలకు తావిస్తోంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబుకు సన్నిహితుడు అన్న ముద్ర ఉంది. అందుకే జగన్ బెంగళూరు నగరాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. కానీ ఇందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# ఫైల్స్ లెక్కేంటీ.....మాయం... పైఆరా



**విజయవాడ :** అమరావతి రాజధాని నిర్మాణానికి నాడు టిడిపి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాజధాని ప్రాంత ప్రాధికార సంస్థ (సిఆర్డి ఏ)ను ఏర్పాటు చేసింది. అందరి ఆమోదంతో అమరావతిని రాజధానిగా చేసిన చంద్రబాబు.. అక్కడ నిర్మాణ పనులు ప్రారంభించారు. సిఆర్డిఏ ను మరింత పటిష్టం చేశారు. అప్పట్లో టిడిపి ప్రభుత్వం అమరావతికి సంబంధించి కీలక నిర్ణయాలు కూడా తీసుకుంది. అయితే ఇప్పుడు అదే కార్యాలయంలో టిడిపి హయాంనాటి ఫైళ్లు మాయం కావడం ఆందోళన కలిగిస్తోంది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి కేంద్రంగా అవినీతి జరిగిందని ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై టిడిపి ముఖ్య నేతలపై కేసులు కూడా నమోదయ్యాయి. అప్పట్లో సిఆర్డిఏ ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విచారణ కోసం పలు ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో కొన్ని ఇప్పుడు కనిపించడం లేదు. దీంతో సిఆర్డిఏ అధికారులు ప్రభుత్వానికి ప్రత్యేకంగా నివేదించినట్లు సమాచారం. ఇటీవల రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత.. ఎక్కడికక్కడే ఫైళ్లు మాయం కావడం.. అగ్ని ప్రమాదాలు సంభవించి దగ్ధం కావడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం అమరావతి నిర్మాణాలపై నిపుణుల నివేదికలు, మరోవైపు సిఆర్డిఏ సమీక్షలు సీరియస్ గా జరుగుతున్న వేళ.. ఫైళ్లు మాయం కావడం ఆందోళన కలిగిస్తోంది. నాడు విచారణ పేరుతో తీసుకెళ్లిన ఫైళ్లను మాయం చేసి ఉంటారన్న అనుమానాలు పెరుగుతున్నాయి. కేవలం కేసుల భయంతోనే ఇలా చేసి ఉంటారన్న అనుమానాలు ఉన్నాయి. సిఆర్డిఏ వ్యవహారాలకు సంబంధించి మంత్రి నారాయణ సమీక్షిస్తున్నారు. అమరావతి రాజధాని నిర్మాణాలకు సంబంధించి ప్రత్యేక బాధ్యతలు తీసుకుంటున్నారు. ఈ తరుణంలో సిఆర్డిఏ కార్యాలయంలో ఇంజనీరింగ్, ప్లానింగ్, రెవెన్యూ, ఎస్టేట్.. ఇలా పలు విభాగాల ఫైల్స్ కనిపించడం లేదు. దీనిపై అధికారులు మంత్రి నారాయణ కు ఫిర్యాదు చేశారు. ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అంశంపై గత వైసిపి ప్రభుత్వం కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. చంద్రబాబుపై అక్రమ కేసుల్లో అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు ఒకటి. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలో అవకతవకలకు పాల్పడ్డారు అన్నది అప్పటి వైసీపీ ప్రభుత్వ ఆరోపణ. ఆ కేసులో చంద్రబాబుతో పాటు మంత్రి నారాయణ పేరును కూడా చేర్చారు. అప్పట్లో విచారణ నిమిత్తం సి ఆర్ డి ఏ నుంచి చాలా ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు అవే ఫైళ్లు కనిపించకపోవడం విశేషం. మొన్ననే మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో కీలక ఫైళ్లు దగ్ధమయ్యాయి. ఈ కేసును ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. సిఐడి దర్యాప్తు సైతం కొనసాగుతోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే సిఆర్డిఏఫ్ ఫైళ్లు సైతం మాయం కావడం ఆందోళన కలిగిస్తోంది.

# టీటీడీ నకిలీ నియామక పత్రాలు...చిక్కుల్లో మాజీ మంత్రులు



**విజయవాడ :** మాజీ మంత్రులు రోజా, అనిల్ కుమార్ యాదవ్ చిక్కుల్లో పడ్డారు. ఇద్దరిపై భారీగా ఫిర్యాదులు వచ్చాయి.. మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన వినతుల స్వీకరణలో బాధితులు జనసే పార్టీ ఎమ్మెల్యే లోకం నాగ మాధవికి ఫిర్యాదు చేశారు. టీటీడీలో ఉద్యోగాల ఇప్పిస్తామని చెప్పి మాజీ మంత్రులు రోజా, అనిల్ కుమార్ యాదవ్‌ల పేరుతో గీతా మాధురి అనే మహిళ ఒక్కొక్కరి నుంచి రూ. 5లక్షలు వసూలు చేసినట్లు ఆరోపిస్తున్నారు. దాదాపు 40మంది దగ్గర డబ్బులు తీసుకుని.. అప్పటి ఈవో ధర్మారెడ్డి సంతకాలతో నియామక పత్రాలు, ఐడీ కార్డులు ఇచ్చి మోసం చేసినట్లు ఫిర్యాదు చేశారు. గతంలోనే ఈ మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. తాము చెల్లించిన రూ. 5లక్షలు తిరిగి ఇప్పించి తమకు న్యాయం చేయాలని వారు రిక్వెస్ట్ చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే నాగమాధవి వెంటనే విజయవాడ పోలీసు కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడారు.. బాధితులకు న్యాయం చేయాలని, నకిలీ నియామక పత్రాలపై విచారణ చేపట్టాలన్నారు. తాను పనిచేస్తున్న కంపెనీ తనతో పాటు చాలామంది ఉద్యోగులకు జీతాలు చెల్లించడంలేదని.. ఆరు నెలలుగా ఇబ్బంది పడుతున్నామని విజయవాడకు చెందిన శ్రీలక్ష్మి అనే మహిళ వినతిపత్రం అందజేశారు. పెనుకొండ మండలం నాగలూరుకు చెందిన పల్లపు మంజునాథకు తాతల ద్వారా సంక్రమించిన 5 ఎకరాల భూమిని తన చిన్నాన్న అయిన శనివారమప్ప వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి దౌర్జన్యంగా తీసుకున్నారని జనసేన పార్టీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ నేత నాగలూరు బాబురెడ్డి ద్వారా బెదిరింపులు చేసి రికార్డులు మార్చారని, తనకు న్యాయం చేయాలని కోరారు. 2024 జనవరిలో పశుసంవర్ధక శాఖలో అసిస్టెంట్లకు సంబంధిన పోస్టుల విషయంలో వైఎస్సార్‌సీపీ నేతలు అన్యాయం చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. . మొదటి లిస్టులో సెలక్ట్ చేసి సర్టిఫికేట్ ధ్రువీకరణ కూడా పూర్తయిన వారిని తుదిలిస్టులో తొలగించారని, ఆ పోస్టులను కొందరికి అమ్ముకున్నారని చెప్పారు. ఉమ్మడి కడప జిల్లాలో 210 పోస్టులకు 137 మంది పేర్లు తొలగించారని, తమకు న్యాయం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నేతలు కడప జిల్లాలోని పోలతల దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్ పోస్టు విషయంలో నిబంధనలు పట్టించుకోకుండా.. అర్హత లేని వారికి ఇష్టానుసారం పోస్టును కట్టబెట్టారని, రాత పరీక్ష రాసిన వారికి అన్యాయం చేశారని జనార్ధన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.. తమనకు న్యాయం చేయాలన్నారు. జనసేన పార్టీ సరికొత్త కార్యక్రమాన్ని తీసుకొచ్చింది.. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ప్రజా ప్రతినిధి ఒకరు అందుబాటులో ఉంటారు.. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేయొచ్చు.

# ఆగస్టు 15 నుంచి 3 పథకాలు

**విజయవాడ :** ఏపీలో కూటమి ప్రభుత్వం ఆర్భాటాలకు పోవడం లేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ పాలనపై దృష్టి పెట్టారు. మంత్రుల సైతం తమ శాఖలపై పట్టు పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అమరావతి రాజధాని నిర్మాణం పై సైతం చంద్రబాబు దృష్టి పెట్టారు. కేంద్రం నుంచి 15 వేల కోట్ల రూపాయలు సాయం పొందగలిగారు. మరోవైపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు సైతం వేగవంతం అవుతున్నాయి. అదే సమయంలో రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు కేంద్ర ప్రత్యేక నిధులు ప్రకటించింది. అక్కడ సైతం మౌలిక వసతుల కల్పనకు సంబంధించి పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. అన్నీ బాగానే ఉన్నా.. సంక్షేమ పథకాల విషయంలో మాత్రం ఆశించిన స్థాయిలో ప్రకటనలు రావడం లేదు. ఈ తరుణంలో ఒక ప్రచారం అయితే జరుగుతోంది. ఆగస్టు 15 నుంచి మూడు కీలక పథకాలకు సంబంధించి అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అన్న క్యాంటీన్ల ప్రారంభం, అమ్మకు వందనం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం.. ఈ మూడు పథకాలకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కసరత్తు చేస్తున్నారు. సీఎం గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు కీలకమైన ఐదు ఫైళ్లపై సంతకాలు చేశారు. ఇప్పటికే పింఛన్ల పెంపును అమలు చేసి చూపించారు. డీఎస్సీ పోస్టులు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దుచేసి అనుకున్నది సాధించారు. ఇప్పుడు కీలకమైన మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, అన్న క్యాంటీన్లు, తల్లికి వందనం పథకాలను ప్రకటించి అనుకున్న హామీలను నెరవేర్చిన ఘనతను అందుకోనున్నట్లు తెలుస్తోంది. 2014 టిడిపి అధికారంలోకి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 183 అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. ముఖ్యంగా నగరాలతో పాటు పట్టణాల్లో క్యాంటీన్లు సక్సెస్ అయ్యాయి. ఐదు రూపాయలకే భోజనం తో పాటు అల్పాహారం అందించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్లు నిలిచిపోయాయి. ఆ భవనాలు సైతం మూలకు చేరాయి. అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్లు తెరిపిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఈ ఆగస్టు 15న దాదాపు 100 క్యాంటీన్లను తెరవనున్నారు. సెప్టెంబర్ లో మిగతా 83 తెరుచుకోనున్నాయి. డిసెంబర్ నాటికి మరో 40 క్యాంటీన్లను జరిపించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించి ఇప్పటికే కసరత్తు ప్రారంభమైంది. కర్ణాటక తో పాటు తెలంగాణ ప్రభుత్వాలు సైతం ఈ ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేస్తున్నాయి. దీంతో ఏపీ అధికారులు ఆ రెండు రాష్ట్రాలకు వెళ్లి అధ్యయనం చేశారు. ఈ పథకం అమలు చేయడం ద్వారా నెలకు సగటున 250 కోట్ల రూపాయల భారం పడుతుందని ఒక అంచనా వేశారు. అయితే ఆధార్ కార్డు ప్రాతిపదికన ప్రయాణం కల్పించాలా? లేకుంటే ప్రత్యేక కార్డులు జారీ చేయాలా? అని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ పథకాన్ని ఆగస్టు 15 నుంచి ప్రారంభించి అవకాశము ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. తల్లికి వందనం పథకం సైతం ఆగస్టు 15 నుంచి ప్రారంభించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 20 వేల రూపాయల చొప్పున చదువుకు సాయం అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభమై 50 రోజులు దాటుతోంది. దీంతో ఈ పథకం అమలు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ పథకానికి సంబంధించి అదేరోజు కార్యాచరణ ప్రారంభించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొత్తానికి అయితే ఎన్నికల్లో ఇచ్చిన మూడు హామీలకు సంబంధించి పథకాలు అమలు చేస్తుండడం విశేషం.

# వక్ఫ్ చట్టంలో మార్పులు

**న్యూఢిల్లీ :** త్వరలో వక్ఫ్ చట్టంలో మార్పులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. బోర్డు అధికారాలను తగ్గించే ప్రయత్నం చేస్తోంది. ఈ బిల్లు ప్రకారం ఏదైనా ఆస్తిని వక్ఫ్ బోర్డు స్వంత ఆస్తిగా పిలవడానికి తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. వక్ఫ్ చట్టానికి దాదాపు 40 సవరణలు బిల్లులో ప్రతిపాదించే అవకాశం ఉంది.కేంద్ర ప్రభుత్వం త్వరలో వక్ఫ్ చట్టంలో అనేక భారీ మార్పులు చేయనుంది. ప్రభుత్వం వచ్చే వారం పార్లమెంటులో దీని కోసం బిల్లును తీసుకురావచ్చు. అందులో అనేక సవరణలు చేయవచ్చు అని జాతీయ మీడియా కథనలు ప్రచురించాయి. దీని ప్రకారం వక్ఫ్ బోర్డు అధికారాలను తగ్గించవచ్చు. ఈ బిల్లు ప్రకారం ఏదైనా ఆస్తిని స్వంత ఆస్తిగా పిలవడానికి దాని 'నియంత్రిత' అధికారాలను తగ్గించవచ్చు, మహిళల ప్రాతినిధ్యాన్ని కూడా నిర్ధారించవచ్చు. ఈ బిల్లులో వక్ఫ్ చట్టానికి దాదాపు 40 సవరణలు ప్రతిపాదించే అవకాశం ఉందని ఏజెన్సీ వర్గాలు తెలిపాయి. ఈ బిల్లుకు శుక్రవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని సంబంధిత వర్గాల నుంచి సమాచారం. ఈ బిల్లు చట్టంలోని కొన్ని సెక్షన్లను రద్దు చేయాలని ప్రతిపాదించింది. దీని ప్రధాన లక్ష్యం వక్ఫ్ బోర్డుల వద్ద ఉన్న ఏకపక్ష అధికారాలను తగ్గించడం.ఈ చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం బోర్డు అధికారాలను చాలా వరకు తగ్గించాలనుకుంటోంది. బోర్డు అంతటా మరింత పారదర్శక ప్రక్రియను నిర్ధారించడానికి బిల్లు తప్పనిసరి అని కొంతమంది అంటున్నారు. మహిళలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు వక్ఫ్ బోర్డుల నిర్మాణం, పనితీరులో మార్పులు చేసేందుకు సెక్షన్ 9, సెక్షన్ 14లను సవరించవచ్చు.వివాదాలను పరిష్కరించడానికి, వక్ఫ్ బోర్డులు క్లెయిమ్ చేసిన ఆస్తులపై క్లారిటీ వచ్చేందుకు ఈ సవరణ ఉపయోగపడుతుందని కొందరు అంటున్నారు. వక్ఫ్ ఆస్తుల పర్యవేక్షణలో మేజిస్ట్రేట్‌లు పాల్గొనవచ్చు. ప్రస్తుత చట్టాలను మార్చాలనే డిమాండ్ ముస్లిం మేధావులు, మహిళలు, షియాలు, బోహ్రాస్ వంటి వివిధ వర్గాల నుండి వచ్చిందని కొందరు చెప్పే మాట. దేశవ్యాప్తంగా వక్ఫ్ బోర్డుల కింద సుమారు 8 లక్షల 70 వేల ఆస్తులు ఉండగా, ఈ ఆస్తుల కింద మొత్తం భూమి దాదాపు 9 లక్షల 40 వేల ఎకరాలు ఉంది.వక్ఫ్ చట్టం 1995లో రూపొందించారు. వక్ఫ్ బోర్డు.. విరాళంగా వచ్చిన, అంతేగాకుండా నోటిపై చేసిన ఆస్తులను నియంత్రిస్తుంది. వక్ఫ్ బోర్డు కొన్నిసార్లు వాదనలు చేసిన తర్వాత వివాదాలు అయ్యాయి. ఉదాహరణకు సెప్టెంబరు 2022లో తమిళనాడు వక్ఫ్ బోర్డు మొత్తం తిరుచెందురై గ్రామం యాజమాన్యాన్ని క్లెయిమ్ చేసింది. అయితే ఇక్కడ చాలా మంది హిందూ జనాభా శతాబ్దాలుగా నివసిస్తున్నారు.

# విద్యా, వైద్యారంగాలకు పెద్ద పీట



**ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం లో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అంతకుముందు మంత్రి గువ్వలగూడెం గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. గ్రామంలో నేలకొండపల్లి మండలానికి చెందిన 140 లబ్ధిదారులకు రూ. 36,35,000 ల విలువ చేసే చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామన్నారు. అంతర్గత సిసిరోడ్లు, డ్రయినేజిల పనులు పూర్తిచేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఆరు గ్యారంటీల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు అధికారం చేపట్టిన నెల రోజుల్లోపే అమలుచేశామన్నారు. గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. రైతులను రాజులు చేయాలని, రైతు మొఖంలో ఆనందం చూడాలని నెల రోజులలోపే రూ. 31 వేల కోట్లు రైతు పంట రుణమాఫీ చేశామన్నారు. ధరణి తో ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, నెల, నెలన్నర రోజుల్లో ధరణి ని పూర్తి ప్రక్షాళన చేస్తామని అన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేయనున్నట్లు, పాలేరు నియోజకవర్గానికి కొంత ఎక్కువ ఇండ్లు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. నెలాఖరులోపే రూ. 22 వేల కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టబోతున్నట్లు ఆయన అన్నారు. పేదవారికి ఇండ్ల స్థలాల పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. సీఎంఆర్ఎఫ్ కొరకు దరఖాస్తు చేసిన నెల లోపు మంజూరు చేయనున్నట్లు ఆయన అన్నారు. ఆడబిడ్డల, రైతుల మొఖంలో ఆనందం చూడడం కోసం ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆరోగ్య ఉప కేంద్రం వద్ద మొక్కలు నాటారు.అనంతరం మంత్రి చెన్నారం గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో కూసుమంచి మండలానికి సంబంధించి 161 మంది లబ్దిదారులకు రూ. 46.20 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు.

# సెప్టెంబర్ 4న ఫస్ట్ డిబేట్



**న్యూయార్క్ :** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష ఎన్నికలకు అమెరికన్లు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే బరిలో నిలిచేది ఎవరో తేలిపోయింది. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా మొదట ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ రేసులో నిలిచారు. రిపబ్లికన్ పార్టీ తరఫున మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థిత్వం ఖాయమైంది. దీంతో ఇద్దరూ ప్రచారం మొదలు పెట్టారు. ముఖాముఖి డిబేట్లు కూడా నిర్వహించారు. తొలి డిబేట్‌లోనే బైడెన్ తేలిపోయాడు. దీంతో బైడెన్‌ను తప్పించాలన్న డిమాండ్ పెరిగింది. పోటీలో ఉన్న ఇద్దరి పాలనను చూసిన అమెరికన్లు.. వయోభారంతో బైడెన్‌ను,.. గత పాలన తీరుతో ట్రంప్‌పై విముఖత చూపారు. డెమొక్రటిక్ పాలన మెరుగ్గా ఉన్నా.. బైడెన్ తీరుతో అతడిని మార్చాలని కోరారు. ఈ క్రమంలో ఆ పార్టీకి ఆర్థికసాయం చేసే ఫైనాన్షియర్లు, వివిధ రాష్ట్రాల గవర్నర్లు కూడా బైడెన్ తప్పుకోవడమే మేలని సూచించారు. ఈ క్రమంలో డొనాల్డ్ ట్రంప్‌పై కాల్పులు జరిగాయి. పెన్సిల్వేనియాలో ప్రచారా ర్యాలీలో పాల్గొన్న బైడెన్‌పై దుండగుడు కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో అతడికి తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన తర్వాత ట్రంప్‌కు మద్దతు పెరిగింది. ఆ తర్వాత కొద్ది రోజులకే బైడెన్ కరోనా బారిన పడ్డారు. దీంతో అతను హోం ఐసోలేషన్‌కు వెళ్లారు. ఈ క్రమంలో పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. తన వారసురాలిగా కమలా హ్యారిస్‌కు మద్దతు తెలిపారు.డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి బైడెన్ తప్పుకున్న తర్వాత అధ్యక్ష అభ్యర్థి ఎవరవుతారన్న ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. అయితే బైడెన్ మద్దతు ఇచ్చిన కమలా హ్యారిస్‌కే మాజీ అధ్యక్షుడు క్లింటన్, ఒబామా మద్దతు తెలిపారు. తర్వాత పార్టీలోని డెలిగేట్స్ చాలా మంది కమలకు మద్దతు తెలిపారు. దీంతో కమలా హ్యారిస్ అభ్యర్థిత్వం దాదాపు ఖరారైంది. ఈ క్రమంలో కమలా కూడా ఇటీవల తాను అధ్యక్ష బరిలో ఉన్నట్లు ప్రకటించారు. ఈమేరకు పార్టీ పత్రాలపై సంతకాలు చేసినట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో ట్రంప్.. కమలా హ్యారిస్‌పై విమర్శలు చేయడం మొదలు పెట్టారు. కమలాను ఓడిస్తానంటు సవాల్ చేస్తున్నారు.అధికార డెమొ'క్రటిక్ పార్టీ తరఫున అభ్యర్థిగా కమలా హ్యారిస్ ఖరారు కావడంతో ఆమెతో ముఖాముఖి చర్చకు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సై అన్నాడు. ఈమేరు ఫాక్స్ న్యూస్ ఆఫర్‌ను ఆయన అంగీకరించారు. ఈ విషయాన్ని ట్రంప్ తన ట్రూప్ సోషల్ మీడియాలో తాజాగా పోస్టు చేశారు. వచ్చే నెలలో వీరి మధ్య డిబేట్ జరగనుంది. సెప్టెంబర్ 4న ఫాక్స్ న్యూస్ నిర్వహించే ఈవెంట్‌లో కమలా హ్యారిస్‌తో డిబేట్ జరిపేందుకు ట్రంప్ అంగీకరించారు.

# గీత దాటుతున్న నేతలు...భాషపై చర్చోపచర్చలు



**హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీలో దానం నాగేందర్, కౌశిక్ రెడ్డి వంటి ఎమ్మెల్యేలు మాట్లాడిన బాషను విన్న ప్రజలు అవాక్కయ్యారు. మొదటి వారం రోజుల పాటు సజావుగా సాగిన సమావేశాలు చివరికి వచ్చేసరికి దారి తప్పినట్లుగా మారాయి. చివరి రోజు దానం నాగేందర్ అత్యంత ఘోరంగా మాట్లాడారు. పైగా అవి వాడుక పదాలేనని సమర్థించుకునే ప్రయత్నం చేశారు. ఉపసంహరించుకున్నప్పటికీ.. అవి ప్రజల్లోకి వెళ్లిపోయాయి. చర్చనీయాంశమయ్యాయి. ఎందుకంటే ఏపీలో ఐదేళ్ల పాటు ఇదే భాష విచ్చలవిడిగా వినిపించింది. అలాంటి నేతలకు.. ఆ భాషను ప్రోత్సహించిన పార్టీకి అక్కడి ప్రజలు గట్టి షాక్ ఇచ్చారు. తేరుకోకుండా దెబ్బకొట్టారు. కానీ ఈ గుణపాఠాన్ని నేర్చుకోవడంలో తెలంగాణ నేతలు విఫలమయ్యారు. తెలంగాణ అసెంబ్లీలో దానం నాగేందర్ బీఆర్ఎస్ సభ్యులపై చేసిన వ్యాఖ్యలు బెదిరింపులు ఏపీలో కొంత మంది వైసీపీ నేతల్ని గుర్తుకు తెచ్చాయి. వైసీపీ హయాంలో ఏపీ అసెంబ్లీలో మాత్రమే చూసిన లాంగ్వేజ్ ను ఆయన తెలంగాణ అసెంబ్లీకి తీసుకు వచ్చారన్న విమర్శలు వచ్చాయి. తాను అన్నీ సాధారణ వాడుక భాషనే వాడానని సమర్థించుకునే ప్రయత్నం చేశారు. దానం నాగేందర్ అధికారికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే. ఆ పార్టీ బీఫాం ఇస్తే గెలిచారు. ఇది రెండో సారి. ఆయన బీఆర్ఎస్ పార్టీలో చేరక ముందు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత బీఆర్ఎస్ ఆయనకు రెండు సార్లు టిక్కెట్ ఇచ్చింది. ఇప్పుడు కూడా ఆయన అఫీషియల్ గా బీఆర్ఎస్ ఎమ్మెల్యే. కానీ ఆ పార్టీ నేతలపైనే బూతులు అందుకున్నారు. గెలిచిన పార్టీని అసెంబ్లీలో అలా తిట్టడం.. సభ్యుల్ని బెదిరించడం ఆయనను పార్టీలో చేర్చుకున్న పార్టీ నేతలకు కూడా ఇబ్బందికరంగానే మారింది. కాంగ్రెస్ లోనే కాదు.. బీఆర్ఎస్ లోనూ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యవహారం వివాదాస్పదంగా ఉంది. ఆయన మహిళా నేతలపై తరచూ అనుచిత వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. సాక్షాత్తూ అసెంబ్లీలోనే సీతక్కపై అనుచితంగా మాట్లాడినట్లుగా విమర్శలు ఎదుర్కొన్నారు. అంతకు ముందు గవర్నర్ గా ఉన్న తమిళిశై సౌందరరాజన్‌పై అత్యంత అసభ్యకరంగా ఆయన చేసిన వ్యాఖ్యలు జాతీయ మీడియాలో కూడా వైరల్ అయ్యాయి. దూకుడుగా ఉండే కౌశిక్ రెడ్డి.. ప్రత్యర్థులపై రాజకీయ విమర్శలు చేయడంలో గీత దాటుతున్నారు. ఇది తరచూ విమర్శల పాలవుతోంది. ఏపీలో ఐదేళ్ల కాలంలో రాజకీయ భాష ఎంత దిగజారిపోవాలో అంత దిగజారిపోయింది. అసెంబ్లీలోనే కాదు.. బయట కూడా అత్యంత ఘోరంగా తిట్టుకున్నారు. మహిళా నేత రోజా కూడా తీసిపోలేదు. ఇలా వారి భాష వినీ వినీ చిరాకు పడిన ప్రజలు ఆ బూతు నెతలు ఎవర్నీ మరోసారి అసెంబ్లీకి పంపించలేదు. అత్యంత ఘోరంగా ఓడించారు. బూతు నేతలందరికీ పోలింగ్ బూతుల్లోనే సమాధానం చెప్పారు. ఎన్నికల ఫలితాల తర్వాత వారెవరూ బహిరంగంగా కనిపించడం లేదు. అంతా ఆజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వారి నిర్వాకం కారణంగా వారి పార్టీ కూడా ఘోరంగా ఓడిపోయింది. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. అహంకారం చూపించి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే ప్రజలు సహించరు. తమదైన రోజున ఓటుతో బుద్ది చెబుతారు. తాము గొప్పగా బటన్లు నొక్కి డబ్బులిచ్చామని.. ?ందుకే తమ ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడతామని అనుకుంటే.. ఏపీలో ఎన్నికల ఫలితాల్లాంటివే వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో .. కాస్త ఘాటుగా మాట్లాడినా ప్రజలు అది ఉద్యమ ఆవేశం అనుకున్నారు కానీ.. ఇప్పుడు మాత్రం.. రాజకీయాల్లో ఇష్టం వచ్చిన లాంగ్వేజ్ ను ప్రయోగిస్తే... ప్రజలే ముందుగా శిక్షించడానికి సిద్ధమవుతారు. చట్టసభల్లోనే కాదు..బయట కూడా.. ప్రజల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత నేతలదే. ఎందుకంటే వారిని ఎన్నుకున్నది ప్రజలే మరి.పూర్వపు వైభవంతెలంగాణ అసెంబ్లీ సమావేశాలు చివరి రెండు రోజుల్లో కొన్ని ఘటనలు మినహా అర్థవంతమైన చర్చలు జరిగాయి. ముఖ్యంగా ప్రజా సంబంధిత అంశాలపై ఎక్కువగా చర్చలు జరిగాయి. అధికార, ప్రతిపక్ష నేతలు హోరాహోరీగా తలపడ్డాయి. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఒక్క బడ్జెట్ ప్రసంగం రోజున మాత్రమే సభకు వచ్చారు. ఆయనకు సభకు రాకపోవడంతో కాంగ్రెస్ పదే పదే కార్నర్ చేసింది.

# చనిపోయిన బాలికకు ఇంకా వైద్యం అందించాలని వైద్యులు తిరగబడ్డ బంధువులు




**ఖమ్మం :** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో ఠాగూర్ సినిమాను తలపించే విధంగా వైద్యం చేసిన ఓ ప్రైవేట్ ఆసుపత్రి బాలిక మరణించినా కూడా మెరుగైన వైద్యం కావాలంటూ అంబులెన్స్ ఎక్కించడంతో మరణించిన విషయాన్ని తెలుసుకొని విజేత హాస్పిటల్ వారిపై బంధువులు ఆందోళనకు దిగారు.ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రేగళ్లపాడు గ్రామానికి చెందిన చెందిన ఎస్.డి ఉస్మాన్ పాషా, షబిహా దంపతుల కుమార్తె సనా తబుసుమ్ (15). ఈమె భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాగుపల్లి హైస్కూలులో 10వ తరగతి చదువుతుంది. 2 రోజుల క్రితం విరోచనాలతో నీరస పడితే తల్లిదండ్రులు సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడు వద్ద చికిత్స చేయించగా పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి పట్టణంలోని విజేత ఆసుపత్రికి తీసుకు వచ్చి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో ప్లేట్ లెట్స్ 40వేల నుంచి 14వేలకు పడిపోయి బాలిక మృతి చెందింది.కానీ వైద్యులు మాత్రం బాలిక పరిస్థితి విషమంగా ఉంది మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించాలని సూచించి అంబులెన్స్ లో తరలించే ప్రయత్నం చేశారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు గమనించిన బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. సత్తుపల్లి పట్టణ సీ.ఐ టీ.కిరణ్ ఆస్పత్రికి చేరుకుని మృతురాలి బంధువులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. మృతి చెందిన విషయాన్ని గోప్యంగా ఉంచి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది మెరుగైన వైద్యం కావాలని అంబులెన్స్ లో తరలించే ప్రయత్నం ఎందుకు చేశారని బంధువులు ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగారు.దీంతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత నెలకొంది. ప్లేట్ లెట్స్ తగ్గిపోవడం, బీపీ డౌన్ అవ్వడం, డెంగ్యూ జ్వరంతో కిడ్నీ, లివర్ ఫెయిల్యూర్ అవ్వడంతో బాలిక మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు అంటున్నారు.

# భారీగా పట్టుబడుతున్న గంజాయి




**హైదరాబాద్ :** హైదరాబాద్ లో భారీ స్థాయిలో గంజాయి పట్టుబడింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎస్వోటీ (స్పెషల్ ఆపరేషన్ టీమ్) పోలీసులు ఈ గంజాయిని గుర్తించారు. దాదాపు 800 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ ఎస్వోటీ, శంషాబాద్ పోలీసులు కలిసి ఈ జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2.94 కోట్ల విలువ ఉంటుందని పోలీసులు చెప్పారు. 800 కేజీల గంజాయి కంటెయినర్ లో ఓ వాహనం ఒడిశా నుంచి మహారాష్ట్రకు హైదరాబాద్ మీదుగా వెళ్తున్నట్లుగా విచారణలో పోలీసులు గుర్తించారు.ఈ స్థాయిలో గంజాయి తరలిస్తూ పట్టుబడటం ఇదే తొలిసారని పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. డీసీఎం డ్రైవర్ లు సంజీవ్ విఠల్ రెడ్డి, హోల్లప్ప, సప్లయర్ సునీల్ ఖోస్లా, జాగ సునాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దందాకు మూలకారకులైన వారి గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. అరకుకు చెందిన వ్యక్తి గంజాయి సరఫరాదారుగా ఉన్నాడని, అతని పేరు రాము అని తెలిపారు. అతను ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు చెప్పారు. ఇతను చాలా పెద్ద మొత్తంలో గంజాయిని ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటాడని పోలీసులు చెప్పారు. కమీషన్ ఏజెంట్ కం ట్రాన్స్‌పోర్టర్ గా ఒడిశాకి చెందిన సోమ్ నాథ్ ఖారా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రాము అనే వ్యక్తి గతంలో గంజాయి రవాణా చేస్తూ అరెస్ట్ అయ్యాడు. మెయిన్ పెడ్లర్ కం రిసీవర్ సురేష్ మారుతి పాటిల్ కూడా పరారీలో ఉన్నాడు. "ఇలా గంజాయి ట్రాన్స్‌పోర్ట్ చేసినందుకు ప్రతిసారి రూ.2 లక్షలు రూపాయలు తీసుకుంటారు. నిందితులు అంతా కలిసి ఎంతకాలంగా గంజాయి సప్లై చేస్తున్నారో విచారిస్తున్నాం. ప్రధాన నిందితుడు రాముతో పాటు సురేష్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు. పోలీస్ నిఘా తప్పించుకోవడానికి కంటైనర్ ముందు నిందితులు కార్ లో ఎస్కార్ట్ గా వచ్చారు. కంటైనర్ కు రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండి ఎక్కడైనా పోలీసుల తనిఖీలు ఉంటే అప్రమత్తం చేస్తారు. పోలీసుల నిఘానుండే తప్పించుకోవడానికి టోల్గేట్ వద్దకు కంటైనర్ రాంగానే వాహనం నంబర్ ప్లేట్ మారుస్తారు. నిందితులపై అనుమానంతో 15 నుండి 25 రోజులు వరకు ఈ కేసు పై వర్కౌట్ చేసాం. నిందితులు ఒరిస్సా నుండి గంజాయి తీసుకువచ్చి పటాన్చెరువు వద్ద మరొక వెహికల్ లో గంజాయిని మారుస్తారు. మార్చిన ఆ వెహికల్ లో గంజాయిని మహారాష్ట్రకు తీసుకువెళ్తారు.విట్టల్ రెడ్డి పరవాడ సెజ్ లో సాల్వెంట్ డ్రమ్ములను కంటైనర్ లోడ్ చేసుకున్నాడు. కంటైనర్ ముందు భాగంలో సాల్వెంట్ డ్రమ్స్ పెట్టి వెనకాల భాగంలో గంజాయి ఉంచారు. కెమికల్స్ డ్రమ్ములను కూడా జిఎస్టి వేబిలు లేకుండా తరలిస్తున్నారు. ఆ కెమికల్ సాల్వెంట్స్ ఏంటి అన్న అంశంపై కూడా విచారణ చేస్తాం. మొత్తం ఏడుగురు నిందితులు గంజాయి సప్లై లో భాగంగా ఉన్నారు..ఇందులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసాం. మిగతా ముగ్గురు నిందితులను పరారీలో ఉన్నారు..వారిని వీలైనంత త్వరగా పట్టుకుంటాం" అని పోలీసులు అన్నారు.

# ఆక్టోబర్ 1 నుంచి ఉప్పల్ ఎలివేటర్ కారిడర్ పనులు ప్రారంభం మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డీ



**మేడ్చల్ :** అరెండ్ల నుండి ఉప్పల్ ఎలివెటర్ కారిడార్ పనులు నిర్లక్ష్యం గురైందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కేటీఆర్ ఇంగ్లీష్ లో మాట్లాడడం, సెల్పిలు దిగడం తప్పా, హైదరాబాదు నగరాన్ని అభివృద్ధి చెయ్యలేదు. గతంలో ఇదే నియోజకవర్గం నుండీ గెలిచిన రేవంత్ రెడ్డి ఉప్పల్ వెలివేటర్ కారిడార్ పనులు పై అనేక సార్లు పార్లమెంట్ లో మాట్లాడాడు. ఈ మధ్య కాలంలో కేంద్ర మంత్రినీ నితిన్ గడ్కారీనీ కలిసి చెప్పాను. ఆరెండ్ల నుండి ఉప్పల్ వెలివేటర్ కారిడార్ పనులు నిర్లక్ష్యానికి గురైంది అని చెప్పాను. కొత్త టెండర్లతో పనులకి అవకాశం ఇచ్చారు....ఇంకో 200 నుండి 300 కోట్ల వరకు పెరుగుతుందని అన్నారు. వర్ష కాలంలో రోడ్లన్ని దెబ్బతిన్నాయి వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజలు భాగ ఇబ్బందులు పడుతున్నారు అని నాకు తెలుసు. నేను మాట ఇస్తున్నా వచ్చే 10 రోజుల్లో పనులు ప్రారంభిస్తాం. పదేండ్ల పాటు పాలించిన గత ప్రభుత్వం పనులు చెయ్యకుండా నిర్లక్ష్యానికి గురి చేసింది. లక్ష కోట్లు పెట్టీ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలింది. మూసీ నది అభివృద్ధికీ మా ప్రభుత్వం కట్టుబడి ఉన్నది.... ప్రపంచ బ్యాంకుతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతాడు.. నిధులు తెచ్చి మూసీనీ అభివృద్ధి చేస్తాం. 31 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంది. చైనా లో 57 అంతస్తుల హోటల్ 30 రోజుల్లోనే కట్టారు. దేశంలోని మొట్టమొదటి హోం మంత్రి, సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించింది. అసెంబ్లీలో మేము మహిళలను కించ పరచలేదు. మా ప్రభుత్వంలో పదవులు అనుభవించి పార్టీ మారిన వ్యక్తి సబిత ఇంద్రారెడ్డి మా ప్రభుత్వం మహిళలను గౌరవిస్తుంది... మహిళలకు రెండు పదవులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంది. 65 గంటల్లో 45 గంటలు ప్రతిపక్ష నేతలే మాట్లాడారు. అసెంబ్లీకి రాని వ్యక్తికీ ఎమ్మెల్యే పదవీ అవసరమా. టోపీ పెట్టుకొని తిరుగుతున్న వ్యక్తికెసిఆర్... ఆయన వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్యాలి. ఉప్పల్ ఎలివేటర్ కారిడార్ పనులు అక్టోబర్ 1 నాడు ప్రారంభిస్తున్నాము. 18 నుండి 20 నెలల్లో పూర్తి చేసి చూపిస్తానని అన్నారు.

# సంతోషమే సగం బలం



సంతోషం సగం బలం హాయిగ నవ్వమ్మా అనేది తెలుగు నానుడి. సంతోషంగా ఉన్నపుడు మనసూ, మనచుట్టూ ఉన్న పరిసరాలు అన్నీ సంతోషంగా ఉన్నట్లే కనిపిస్తాయి. అసలు మనిషికి సంతోషం ఎలా కలుగుతుంది. తాను కోరింది లభించినపుడు, తాను చేపట్టిన కార్యాలు సఫలమైనపుడు, ఏవిధమైన శారీరక, మానసిక బాధలూ లేనపుడు విజయాలు సాధించినపుడు సంతోషం కలిగినట్లు భావిస్తాం. మనిషి జీవితం చాలా చిన్నది. అందుకే మనం లభించిన దానితో సంతోషిస్తూ మనతో పాటు మన చుట్టుపక్కల వారికి కూడా ఆనందాన్ని పంచడమే అసలైన సంతోషం. సంతోషంగా ఉన్నపుడు మన శరీరం సైతం తేలికగా ఉంటుంది. ఏ పనైనా ఇట్టే చేయగలుగుతాం. ఆడుతుపాడుతు పనిచేస్తుంటే అలుపుసొలుపేమున్నదీ అనే పాట వినే ఉంటారు అంతా. ప్రతిరోజు నీ ఆనందం చేసుకునే పద్ధతులు చాలానే ఉన్నాయి. వాటిని మనం అనుసరించినట్లయితే ఆనందం మనసొత్తే. తృప్తిలో ఉన్న ఆనందం దేనిలోనూ రాదు. బంగారు కంచంలో పదహారు రకాల స్వీట్లు తినేవాడు ఆనందంగా ఉన్నాడని చెప్పలేం. అతడు తన ఆస్తిపాస్తుల రక్షణ గురించే నిరంతరం ఆలోచిస్తూ చింతిస్తూనే ఉంటాడు. రోడ్డు పక్కనే గుడిసెలో ఉన్న వ్యక్తి తన కుటుంబంతో కలిసి గంజి త్రాగుతూ ఆనందంగా ఉండటాన్ని చూస్తే మనకు ఆనందమెక్కుడుందో అర్థమవ్వతుంది. పుట్టుక వెనుకే చావ్వ. ఈలోగా జీవనయానం అనేక విధాలుగా సాగుతుంటుంది. ఈలోగా చదువు, ఉద్యోగం, వివాహం, సంతానం, బాధ్యతలు, బరువ్వలూ, కర్తవ్య నిర్వహణ, అహంకారం, మమకారం, పగ, ప్రతీకారం, కోపం, దాని వలన చేసే పాపం, స్నేహం, విరోధం, ప్రేమ ఇదే జీవితం. ఎగుడుదిగుడుల కంకర రాళ్ల బాటన ఒంటెద్దు బండిలో గతుకులతో సాగిపోతుంటుంది జీవితం. ఎవ్వరూ ఈ ఒడిదుడుకులను తప్పించుకోడం సాధ్యం కాదు. కనుక సహజం అయిన దాన్ని తనకే ప్రాప్తించే కష్టంలా కాక, ఇది అందరికీ సర్వసాధారణమని భావించినపుడు అంత బాధ ఉండదు.

ఎవరి జీవితమూ పూలబాట కాదు. వడ్డించిన విస్తరి కాదు. ముళ్లు, రాళ్లూ, పూలూ అన్నీ కలిస్తేనే జీవితం. చేదు రుచి తెలీకుండా తీపి రుచి తెలీదు. కేవలం సుఖాలనే చూసిన తర్వాత కష్టాల్ని చూసిన సిద్ధార్థుడు బుద్ధునిగా మారిపోవడం మనకు తెలుసు. కనుక కష్టసుఖాలు కావడి కుండలని విశ్వసించాలి. జీవితం కోసం జీవించడం ఒక అపూర్వమైన వరము. మనకోసం మనం జీవించాలి. ఆశ, అహంకారం అనే వాటిని వదలి మనచుట్టూ ఉన్నవారిని ప్రేమిస్తూ, స్నేహభావంతో మెలగాలి. మంచిలోనే సంతోషం ఉందని గుర్తించాలి. గతాన్ని గురించి తలంచి చింతించక, భవిష్యత్తు గురించీ భయపడక వర్తమానంలో నర్తించాలి. జీవించే ప్రతిక్షణం మనదిగా భావించాలి. అది హ్యాపినెస్‌డే సెలెబ్రేషన్. అదే ఆనంద దినోత్సవం. మనం మన జీవితాన్ని ఇష్టపడుతూ మనల్ని మనం ప్రేమించుకుంటూ తోటివారికి ప్రేమ పంచాలి. త్యాగంలోని సంతోషాన్ని అనుభవించాలి. నిరంతరం ఆనందంగా ఉంటూ చుట్టూ ఉన్నవారిని ఆనంద పరచాలి. పరిశుద్ధ మనస్తత్వం కలిగి ఉండాలి. భయాన్నీ వీడి, సేవాభావాన్ని పెంచుకోవాలి. అపుడు అంతా నీకు స్నేహితులే, నీ శ్రేయస్సు కోరేవారే! వారందరి నడుమా ఆనందం కాక మరేముంటుంది? పరోపకారం ఇదం శరీరం. పర ఉపకారమే స్వఉపకారంగా భావించడమే ఆనందమయ జీవితానికి అసలు రహస్యం. ఈ సంతోష దినోత్సవాన్ని ముందుగా పోర్చుగల్ దేశస్థుడైన లిబర్టో పెరెడా అనే వ్యక్తి అంతర్జాతీయ హ్యాపీనెస్‌డేని ప్రారంభించాడు. ప్రపంచములో అందరూ ఆనందంగా జీవించాలన్నదే ఈ దినోత్సవ ఉద్దేశ్యం. జీవితం ఆనందకరముగా ఉండేందుకు ఎన్నో సూత్రాలను అనేక దేశాల్లో ప్రచారం చేయడం జరిగింది. ఈరోజున కొందరికైనా ఏదైనా సాయమో, భోజనమో, బట్టలో, వృద్ధాశ్రమం లేదా అనాథాశ్రమ సందర్శనమో చేయడం ఉత్తమోత్తమం. హ్యాపినెస్‌డే అసోసియేషన్లు చాలా దేశాల్లోనూ ఏర్పడ్డాయి. ఈరోజున నీతో పాటు మరికొందర్ని సంతోషపడితే అదే నిజమైన సంతోషదినోత్సవం. 194 దేశాల్లో హ్యాపీనెస్‌డే అసోసియేషన్స్ ఉన్నాయి. కొన్ని దేశాలు జూలై 10న ఇంటర్నేషనల్ హ్యాపీనెస్ డేని జరుపుకుంటున్నారు. మనదేశముతో పాటు చాలా దేశాలు ఆగస్టు 8న జరుపుకుంటున్నాము.

# సామాజిక రుగ్మతలపై జబ్నా పోరాటం



చదువుకోవాలనే బలమైన ఆశయం ఉండాలే కానీ, అందుకు మార్గాలు అనేకం ఉంటాయి. ఫీజులు చెల్లించేందుకు డబ్బు లేకపోవచ్చు. పుస్తకాలు ఇతర అవసరాలను తీర్చుకునేందుకు ఎలాంటి ఆధారం లేకపోవచ్చు. అయితేనేం పట్టుదల అనేది ఉంటే చాలు, చదువ్వలో రాణించవచ్చని నిరూపిస్తున్నారు జబ్నాచౌహాన్ అనే యువతి. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని మండి జిల్లాకు చెందిన జబ్నాచౌహాన్ చిన్నతనం నుంచి చదువ్వకోవాలనే ప్రగాఢకాంక్ష వ్వండేది. అయితే వ్యవసాయం చేసుకునే తండ్రి వద్ద అంత స్తోమత లేదు. డబ్బు లేదని చదువ్వకు స్వస్తి చెప్పలేదు జబ్నా. పొలాల్లో పనిచేయడం మొదలుపెట్టి, సొంతంగా డబ్బు సంపాందించి, ఆ డబ్బుతో చదువ్వకోవడం ఆరంభించింది. ఒకవైపు పొలం పనులు, మరొకవైపు చదువుతో బిజీగా ఉంటున్నా, తన జిల్లాలో పేదప్రజల బాగోగులను చూసేది. ప్రజల ఇబ్బందులపై మనసుపెట్టి, వాటి పరిష్కారానికి కృషి చేసేది. దీంతో ఆమె అతిపిన్న వయసులోనే సర్పంచ్‌గా ఎంపికైంది. దేశంలోనే పిన్నవయసులోనే సర్పంచ్‌గా ఎంపికైన యువతిగా పేరుపొందింది. సర్పంచ్‌గా విశేష సేవలను అందిస్తున్న కారణంగా ఆమెకు 'బెస్ట్ ప్రదాన్ అవార్డును కూడా పొందింది. 23 సంవత్సరాల జబ్నాచౌహాన్ తన జిల్లాలో బహిరంగంగా మద్యం సేవించడాన్ని నిషేధించింది. ఇది ఎలా సాధ్యమని ఆమెను అడిగితే, సామాజిక సేవ చేయాలనే కోరిక నాలో బలంగా ఉండేది. అంతేకాదు, ప్రజల కష్టసుఖాలపై మనసు పెట్టేదాన్ని, ఇదే నన్ను సర్పంచ్‌గా చేసిందేమో అని అంటారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందాలనే కోరిక నాలో బలంగా ఉండేది. దానికోసం పొలాల్లో పనిచేసి, వచ్చిన డబ్బుతో చదువ్వకోవడం ఆరంభించాను. ప్రజలతో నాకున్న సంబంధం బట్టి, వారే నన్ను బలవంతంగా రాజకీయాల్లోకి రావాలని కోరారు. ఆవిధంగా నేను సర్పంచ్‌గా అయ్యానని జబ్నా చెబుతారు. అంతేకాదు ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో కూడా జబ్నా ప్రవేశించి, తమ జిల్లా సమస్యలపై మీడియా ద్వారా పోరాడేవారు. మా జిల్లాలో నాతోపాటు మరో నలుగురు మహిళలు ముందుకు వచ్చి, నాతో పోరాడేందుకు సహకరించేవారు. వారితో కలిసి, మా జిల్లా ప్రజలు, మహిళలు ఎదుర్కొనే సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చించి, మీడియా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారిద్వారా పరిష్కరించుకునే దాన్ని. సర్పంచ్‌గా నేను ఎంపికైనందుకు ఎంతో ఆనందంగా ఉంది. 15 రోజుల్లోనే నా జీవితమే మారిపో యింది. ఈ పదవికి ఎంతో పోటీ ఉంటుంది. నేను గెలుస్తానని అనుకోలేదు. దేశంలోనే అతి పిన్నవయసు రాలిగా నేను ఎంపికైనందుకు ఒకవిధంగా ఇది నాకు కొత్తతోపాటు పలు సవాళ్లు కూడా ఉన్నాయి. ఎందుకంటే అందరూ నాకంటే పెద్దవారు, అనుభవజ్ఞులున్నారు. అయినా కూడా వారి సహకారంతో సర్పంచ్‌గా రాణిస్తాననే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. నేను సర్పంచ్‌గా ఎంపికైన వెంటనే బహిరంగ స్థలాల్లో మద్యం సేవించడాన్ని నిషేధించాను. ఇది నాకెంతో సవాలుతో కూడిన నిర్ణయం. వరకట్న హత్యలు, బాల్యవివాహాలు, మద్యం, మత్తుపదార్థాలు వీటిని రూపు మాపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన సమాజం ఎదుర్కొనే ప్రధాన సమ స్యలు ఇవేనని, వీటివల్ల అపారమైన నష్టా లతో కుటుంబాలు నలిగిపోతున్నా యని జబ్నా తెలిపారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఈ దురా చారాలు రూపుమాపినప్పుడే సమాజం ఆరోగ్య వం తంగా వృద్ధి చెందుతుందని, భవిష్యత్తులో ఒక్కొక్కటి నైనా పరిష్కరించేందుకు కృషి చేయాలనే ఆశయంతో ఉన్నానని జబ్నా చెప్పారు. ఆమె ఆశయం నెరవేరాలని మనం ఆకాంక్షిద్దాం

# కడుపుబ్బరానికి చికిత్స

మూత్రపిండాలు కూడా సరిగా పనిచేయకపోవడం వల్ల వంట్లో నీరు ఉండిపోయి శరీరం ఉబ్బిపోతుంది. పొట్ట బాగా ఉబ్బి ఉండటం, మోకాళ్లు వాపు ఉండటం, జ్వరం రావడం లాంటి లక్షణాలుంటాయి. సాధారణ కారణాలతో కడుపుబ్బరం వచ్చిన వారికి ఈ మందులు వాడటం మంచిది. చిట్కాలు: జీలకర్రను నీటిలో వేసి, రసం తీసి ఆ రసాన్ని ప్రతిరోజూ మూడు పూటలా ఒక స్పూన్ చొప్పున తీసుకుంటే కడుపుబ్బరం తగ్గుతుంది. మెంతుల్ని మెత్తగా పొడిచేసి పూటకు ఒక స్పూను చొప్పున నీటితో మింగాలి. ఇలా రోజుకు రెండుసార్లు తాగితే ఉబ్బరం తగ్గుతుంది. జీడిమామిడి పళ్ళు మూడు తీసుకుని వాటి రసం ఒక కప్పులో పోసి ఒకే మోతాదుగా తాగాలి. రోజుకు రెండుసార్లు తాగితే మంచి ఫలితం ఉంటుంది. పిప్పళ్ళు తీసుకుని బాగా దంచి, చూర్ణం చేసి దానిలో అరస్పూన్ చూర్ణా నికి ఒక స్పూన్ తేనె కలిపి రోజూ మూడుపూటలా వాడుతుంటే కడుపుబ్బరం తగ్గుతుంది. జాజికాయ, జాపత్రి, శొంఠి, లవంగాలు, యాలకులు, చలవ మిరియాలు, సాంబ్రాణి మృదారు చిన్ని వీటన్నిటినీ సమభాగాలుగా తీసుకుని బాగా చూర్ణం చేసుకుని, జల్లించి అరస్పూన్ చొప్పున ప్రతిరోజూ రెండు పూటలా తీసుకుంటే కడుపుబ్బరం వ్యాధి తగ్గు తుంది. మారేడుఆకుల రసం రెండు స్పూన్లు తీసుకుని దానిలో నాలుగు మిరియాలు చూర్ణం చేసి కలిపి తాగితే కడుపుబ్బరం తగ్గిపోతుంది. తుంగముస్తలను శుభ్రం చేసి దాన్ని రసం తీసి, ఆ రసాన్ని ప్రతిరోజూ ఉదయం సమయంలో అరస్పూన్ చొప్పున తీసుకుంటే ఉబ్బరం తగ్గు తుంది. ఒక పసుపు కొమ్మును ఒక కప్పు పాలలో వేసి దాన్ని బాగా మరగకాచి చలార్చి వడగట్టి ఆ పాలను ఉదయం, సాయంత్రం తాగుతూ ఉంటే కడుపు బ్బరం రోగం తగ్గిపోతుంది. శనగగింజంత ఇంగువను రోజూ మూడు పూటలా తీసుకుంటే కడుపుబ్బరం తగ్గుతుంది. ఒక గ్లాసు పాలు తీసుకుని దానిలో కొంచెం నేల ఉసిరి ఆకులు వేసి బాగా మరిగించి ఆ పాలను వడగట్టి తాగుతుంటే కడుపుబ్బరం తగ్గుతుంది. ప్రతి ఆరు గంటలకొకసారి నాలుగు వెల్లుల్లి రేకల్ని నమిలి మింగితే ఉబ్బురోగం తగ్గిపోతుంది. అలాగే పచ్చి కాకరకాయ రసం ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఒక స్పూన్ చొప్పున తీసుకోవాలి.

# కూరల్లో కుర్మా రుచే వేరులే..



కుర్మా అంటే బంగాళాదుంపలతో చేసేదే అనుకుంటారు అందరూ. కాని కొంతమందికి బంగాళాదుంప తింటే పడదు. కాళ్లనొప్పులు, ఒళ్లునొప్పులు వస్తాయి. అటువంటివారికోసం బంగాళాదుంవ లేకుండా అన్ని కూరగాయలతో రకరకాల కుర్మాలు? క్యాలీఫ్లవర్ కుర్మా కావలసినవి: కాలీఫ్లవర్-ఒకటి వచ్చిబఠాణీలు-అరకప్పు, వసువు-చెంచా కారం-అరచెంచా, మెంతులు-చెంచా ఉప్పు-రుచికి తగినంత, కొత్తిమీర-అలంకరణకు ఉల్లిపాయ-ఒకటి, వచ్చిమిర్చి-మూడు నూనె-నాలుగుచెంచాలు, వెల్లుల్లి-నాలుగు రెబ్బలు అల్లం-చిన్నముక్క, టమాటగుజ్జు-అరకప్పు జీడిపప్పు-పది, గసగసాలు-రెండు చెంచాలు లవంగాలు-నాలుగు, దాల్చినచెక్క-ఒక ముక్క కొబ్బరి తురుము-చెంచా, ఎండుకొబ్బరి-నాలుగు తయారుచేసే విధానం వేడినీళ్లలో ఉప్పు, పసుపు వేసి కాలీఫ్లవర్‌ను ఉంచి, కాసేపయ్యాక తీసి, విదిలిస్తే పురుగులు బయటకు వస్తాయి. ఆపై పువ్వులను సన్నగా విడదీసి ఉడికించాలి. ఉల్లిపాయలు, పచ్చిమిర్చి తరుగు, అల్లం, వెల్లుల్లి సన్నగా తరిగి మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. అలానే నీళ్లలో నానబెట్టిన జీడిపప్పు, గసగసాలు, యాలకులు, లవంగాలు, దాల్చినచెక్క, కొబ్బరితురుము, ఎండుమిర్చి కలిపి మసాలా తయారుచేసుకోవాలి. బాణలిలో నూనె వేడిచేసి మెంతులు, ఉల్లిపాయ ముద్ద వేసి వేయించుకోవాలి. కొద్దిసేపయ్యాక టమాట గుజ్జు ఉప్పు, కారం కలియతిప్పాలి. కాసేపాగి క్యాలీఫ్లవర్ ఉడికించిన బఠాణీ లు, ముందుగా సిద్ధం చేసుకున్న జీడిపప్పు మసాలాముద్ద కాసిని నీళ్లు చేర్చి మూత పెట్టాలి. గ్రేవీ దగ్గరగా అయ్యాక పొయ్యి మీద నుంచి దించేయాలి. వంకాయ మసాలా కుర్మా కావలసినవి: వంకాయలు-పావ్వకేజి శనగప్పు-చెంచా, మినపప్పు-చెంచా, ధనియాలు-చెంచాన్నర ఎండుమిర్చి -నాలుగు, ఆవాలు -అంచెంచా నూనె -నాలుగు చెంచాలు, ఇంగువ -చిటికెడు, వసువు-చిటికెడు చింతపండు గుజ్జు-అరచెంచా, ఉప్పు-రుచికి తగినంత తయారుచేసే విధానం బాణలిలో మినపప్పు, శనగపప్పు, ధనియాలు, ఎండుమిర్చి కొద్దిగా ఇంగువ వేసి వేయించాలి. చల్లారాక మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. తరువాత బాణలిలో నూనె వేడిచేసి ఆవాలు, పసుపు, వంకాయ ముక్కలు వేయాలి. అవి మగ్గే దాకా మూతపెట్టాలి. కూర అయ్యాక ఉప్పు, చింతపండు గుజ్జు, ముందుగా సిద్ధం చేసి పెట్టుకున్న మసాలపొడి వేసి బాగా కలపాలి. అయిదు నిమిషాలయ్యాక దించేస్తే వంకాయ మసాలా కుర్మా రెడీ.

# గాజుల వెనుక ఆరోగ్య రహస్యం



గాజులు మనకు అలంకరణ వస్తువ్వలుగా, ఆభరణాలుగా మాత్రమే తెలుసు. రంగు రంగు గాజులను ధరించి ఫ్యాషనబుల్‌గా కనిపించడానికి ప్రయత్నిస్తాం. అలాగే చేతినిండా బంగారు గాజులు ధరించి, వాటిని ఆస్తిగా పరిగణిస్తాం. అయితే గాజులు ధరించడం అనే ఆచారం ఎందుకు వచ్చిందో తెలుసా? గర్భాశయనాడు లను ఉద్దీపనం చేయడానికి ఉద్దేశించినవే గాజులు. మహిళలకు మణికట్టుకు ముంజేతికి మధ్య ఉండే నాడులు గర్భాశయనాడులతో అనుసంధానమై ఉంటాయి. మణికట్టునాడులు స్వల్పంగా ఒత్తిడికి లోనవ్వతుంటే, గర్భాశయ నాడులు కూడా అందుకు అనుగుణంగా ఉత్తేజితమవ్వతుంటాయి. దాంతో గర్భాశయం పనితీరు, కండరాల కదలికలు సవ్యంగా జరుగుతుంటాయి. ఇందుకు తప్పనిసరిగా గాజులనే ధరించాలా? ప్రత్యామ్నాయం లేదా అంటే? ఉంది. రోజూ కొంతసేపు మణికట్టు, ముంజేతి మధ్య చేత్తో నొక్కుకోవచ్చు. అలాగని మర్దన చేసినంత ఒత్తిడి పడకూడదు. కాబట్టి ఒక రకంగా అలంకరణ గాను, ఆరోగ్యసాధనంగాను ఉపకరించే విధంగా డిజైన్ అయినవే ఈ గాజులు.

# తండ్రికితగ్గ ప్రతిభాశాలి



ఒకప్పుడు ఇంటి గడపకూడా దాటని మహిళ నేడు అనేకరంగాల్లో ప్రవేశించి, విజయవంతంగా రాణిస్తున్నది. స్త్రీలు ఉద్యోగులు అంటే టీచర్లు, నర్సులు, డాక్టర్లు, ఆయాలుగానే పనిచేసేవారు. మిగతా రంగాల్లో పెద్దగా రాణించలేరనే భావన చాలాకాలం సమాజంలో పాతుకునిపోయిన సంకుచిత భావన. మూడునాలుగు దశాబ్దాలుగా ఈ భావజాలానికి కాలం చెల్లింది. మహిళలు పైలెట్లుగా రాణిస్తున్నారు, నావికాదళంలో ప్రవేశించారు, సైన్యంలో చేరి, తమ సత్తాను చాటుకుంటున్నారు. మహిళా ఇంజినీర్లుగా పలురంగాల్లో విజయవంతంగా రాణిస్తున్నారు. క్యాబ్‌డ్రైవర్లుగా, ఆటోడ్రైవర్లుగా ధైర్యంగా పనిచేస్తున్నారు. విద్యా, వైద్య, సాంకేతిక రంగాల్లో సైంటిస్టులుగా అభివృద్ధి చెందుతున్నారు. తమకు అసాధ్యమైన రంగం అంటూ ఏదీ లేదని అన్నిరంగాల్లో ప్రవేశించి, తిరుగులేని మహిళగా తన విజయాలను సొంతం చేసుకుంటున్నది. తాజాగా వైద్యరంగంలో పరిశోధన చేస్తున్న సౌమ్యాస్వామినాధన్ 'వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్ఒ)కు డిప్యూటీ జనరల్ ఆఫ్ ప్రొగ్రామస్‌గా ఎంపికై, భారతదేశానికే గర్వకారణంగా నిలిచారు. ప్రస్తుతం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్)లో డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా, సెక్రటరీగా పనిచేస్తున్న సౌమ్య ప్రపంచ ఆరోగ్య సంస్థలో డిడిజిగా ఎంపికైన భారతీయురాలిగా ఘనతకెక్కారు. అంతేకాక సౌమ్యాస్వామినాధన్ పిడియాట్రిక్, హెచ్ఐవిలో పరిశోధకురాలిగా కూడా పనిచేస్తున్నారు. దాదాపు 30 సంవత్సరాలు వైద్యురాలిగా, పరిశోధనరాలిగా పనిచేస్తున్న సౌమ్య ప్రపంచబ్యాంక్, యూనిసెఫ్‌లలో కూడా పనిచేసిన అనుభవం ఉంది. ఈమె తండ్రి ఎం.ఎస్ స్వామినాధన్ ప్రముఖ హరిత విప్లవకారుడిగా ప్రసిద్ధి నొందారు. వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తేవడం మాత్రమే కాక మొక్కలు, చెట్ల పెంపకంలోను, అడవ్వల సంరక్షణకు విశేష కృషి చేశారు. ఈయన కూతురుగా పుట్టిన సౌమ్య తండ్రికి తగ్గ తనయగా వైద్యరంగాన్ని ఎంచుకుని, పేరు గడించారు. ఈ సందర్భంగా వైద్యరంగంలో ఆమె చేస్తున్న కృషి, పొందిన విజయాల గురించి తెలుసుకుందాం. పుట్టుపూర్వోత్తరాలు భారత హరిత విప్లవకారుడిగా ఘనతపొందిన ఎం.ఎస్.స్వామినాధన్, విద్యావేత్త మినాస్వామినాధన్‌ల కూతురు సౌమ్యాస్వామినాధన్. స్వస్థలం చెన్నై. ఆర్మ్‌డ్ ఫోర్స్ మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.ఎస్. చదివి, ఎయిమ్స్‌లో ఎండిగా చదివారు. తర్వాత అమెరికా, బ్రిటన్‌లో పోస్ట్ డాక్టరల్ మెడికల్ ఫెలోషిప్‌లో పిడియాట్రిక్ పల్మానాలజీ చేశారు. కాలిఫోర్నియా, బ్రిటన్‌లో పిడియాట్రిక్ విభాగంలో కొంతకాలం పనిచేశారు. అలాగే సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్‌గా, ప్రొఫెసర్‌గా, డైరెక్టర్‌గా పలు పదవ్వలను అలంకరించారు. జాతీయ, అంతర్జాతీయంగా పలు ఆరోగ్యసంస్థల్లో సభ్యులుగా కమిటి మెంబర్‌గా కూడా పనిచేశారు. ప్రస్తుతం సౌమ్య ట్యూబక్యూలస్, హెచ్ఐవిలలో వరిశోధనలు చేస్తున్నారు. అవార్డులు 1999లో డాక్టర్ కియా లహరి అవార్డును జాతీయ సెమినార్‌లో పిడియాట్రిక్ పల్మనరీపై సమర్పించిన పత్రాలకు లభించింది. 2009లో టిబి, ఊపిరితిత్తులపై ఆమె చేసిన పరిశోధనలకుగాను అవార్డును అందుకున్నారు. 2011లో భారత అకాడమి తరపున పిల్లల విభాగంలో చేసిన పరిశోధనలకు అవార్డును అందుకున్నారు. 2011లో లైఫ్‌టైమ్ అవార్డును కూడా అందుకున్నారు. 2012లో తమిళనాడు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో అవార్డును పొందారు. ఇదేసంవత్సరం కర్ణాటక ప్రభుత్వం నుంచి కూడా అందుకున్నారు. పపంచ ఆరోగ్య సంస్థ టీమ్ దాదాపు 14 దేశాల నుంచి అనుభవజ్ఞులను ఎంపిక చేశారు. టిబి, హెచ్ఐవిలో పరిశోధనకురాలిగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సౌమ్య ప్రస్తుతం డబ్ల్యూహెచ్ఒకు ఎంపికై, యావత్ భారతదేశానికే గర్వకారణంగా నిలిచారు.

# అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్.. బెస్ట్ స్మార్ట్ ఫోన్ ఆఫర్లు ఇవే..!




2024 ఎ సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి అమెజాన్ గ్రేట్ ఫ్రీడం ఫెస్టివల్ –2024 ప్రారంభం కానున్నది. ఆపిల్ ఐ–ఫోన్ 13, వన్ ప్లస్, రియల్ మీ, ఐక్యూ, శాంసంగ్ స్మార్ట్ ఫోన్లపై భారీ రాయితీలు ప్రకటించింది అమెజాన్. 2024 ఎ ఇండియన్ యూజర్ల కోసం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ తీసుకొచ్చిన 'అమెజాన్ గ్రేట్ ఫ్రీడం ఫెస్టివల్ 2024' ఈ నెల ఆరో తేదీ నుంచి ప్రారంభం అవుతుంది. అమెజాన్ ప్రైమ్ సబ్ స్క్రైబర్లకు ఆరో తేదీ అర్ధరాత్రి.. అంటే సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు మొదలవుతుంది. సాధారణ యూజర్లకు మధ్యాహ్నం 12 గంటలకు అందుబాటులోకి వస్తుంది. ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, టాబ్లెట్లు తదితర పర్సనల్ గ్యాడ్జెట్లపై భారీ డిస్కౌంట్లు ఆఫర్ చేస్తోంది అమెజాన్. అమెజాన్ గ్రేట్ ఫ్రీడం ఫెస్టివల్–2024 కింద డిస్కౌంట్ తోపాటు అదనంగా బ్యాంకు, కూపన్ ఆఫర్లతో స్మార్ట్ ఫోన్ల ధరలు భారీగా తగ్గుతాయి. ఎస్బీఐ క్రెడిట్ కార్డు యూజర్లు, ఎస్బీఐ ఖాతాదారులు ఈఎంఐ పేమెంట్స్ ద్వారా స్మార్ట్ ఫోన్ బుక్ చేసుకుంటే 10 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. కొన్ని వస్తువుల పెర్ఫార్మెన్స్ ఆధారంగా వాటి ఎక్ఛేంజ్ ఆఫర్లతోనూ మరింత ధర తగ్గుతుంది. ఆపిల్, వన్ ప్లస్, శాంసంగ్, ఐక్యూ తదితర బ్రాండ్ల స్మార్ట్ ఫోన్లపై డిస్కౌంట్లు అందుబాటులో ఉన్నాయి. హానర్ 200 5జీ 12 జీబీ ర్యామ్ విత్ 512 జీబీ స్టోరేజీ వేరియంట్ లాంచింగ్ ధర రూ.39,999 పలికితే.. డిస్కౌంట్లతో రూ.29,999లకే సొంతం చేసుకోవచ్చు. రియల్‌మీ జీటీ 6టీ ఫోన్ 8జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ లాంచింగ్ ధర రూ.30,999 అయితే, డిస్కౌంట్లతో రూ.25,999లకు లభిస్తుంది. అలాగే రియల్ మీ నార్జో ఎన్61 ఫోన్ 6జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.8,499లకు ఆవిష్కరిస్తే ఇప్పుడు రూ.6,999లకు సొంతం చేసుకోవచ్చు.

# కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు.. ఒకే రోజు రూ.17లక్షల కోట్ల సంపద ఆవిరి..!



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం కుప్పకూలాయి. సెన్సెక్స్ 2,200 పాయింట్లు, నిఫ్టీ 660 పాయింట్లకుపైగా పతనమయ్యాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మాంద్యం భయాల నేపథ్యంలో భారత్‌తో పాటు ప్రపంచ దేశాల్లోని మార్కెట్లు ఒక్కసారిగా పతనమయ్యాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం కుప్పకూలాయి. సెన్సెక్స్ 2,200 పాయింట్లు, నిఫ్టీ 660 పాయింట్లకుపైగా పతనమయ్యాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మాంద్యం భయాల నేపథ్యంలో భారత్‌తో పాటు ప్రపంచ దేశాల్లోని మార్కెట్లు ఒక్కసారిగా పతనమయ్యాయి. మార్కెట్ల పతనంతో ఒకే రోజు దాదాపు 17లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైంది. కిత్రం సెన్సెక్స్ 80,981.95 పాయింట్ల వద్ద ముగిసిన విషయం తెలిసిందే. ఉదయం సెన్సెక్స్ 78,588.19 పాయింట్ల భారీ నష్టంతో మొదలైంది. ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేదు. ఇంట్రాడేలో 79,780.61 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. 78,295.86 పాయింట్ల కనిష్ఠానికి చేరుకున్నది. చివరకు 2,222.55 పాయింట్ల నష్టంతో 78,759.40 వద్ద ముగిసింది. ఇటీవల 82వేల పాయింట్ల మార్క్‌ను దాటిన సెన్సెక్స్ మళ్లీ చాలా రోజుల తర్వాత 78వేల పాయింట్లకు పడిపోయింది. నిఫ్టీ సైతం 662.10 పాయింట్లు పతనమై.. 24,055.60 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 471 షేర్లు లాభాల్లో కొనసాగగా.. 3,082 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీ అత్యధికంగా నష్టపోయిన వాటిలో టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, ఓఎన్‌జీసీ, హిందాల్కో, టాటా స్టీల్ ఉన్నాయి. ఇక హెచ్‌యూఎల్, నెస్లే, టాటా కన్స్యూమర్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ లాభపడ్డాయి. ఆటో, మెటల్, క్యాపిటల్ గూడ్స్, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, మీడియా, రియల్టీ 4శాతం చొప్పున క్షీణించాయి. అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 3.6 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 4.2 శాతం పతనమయ్యాయి.

# రుణానికి బీమా రక్ష.. హోమ్ లోన్ ఇన్సూరెన్స్ ప్రయోజనాలెన్నో..!

గృహ రుణం అంటే దీర్ఘకాల అప్పు. దీన్ని చెల్లించేటప్పుడు అనేక ఒడిదొడుకులు సహజం. అందుకే ఈ రుణానికి బీమా రక్షణ ఇవ్వడం తెలివైన పని అనిపించుకుంటుంది. అప్పుడే మనకు, మన కుటుంబ సభ్యులకు ప్రశాంతత అనేది ఉంటుంది. నిజానికి రుణం తీసుకుంటే దానికి బీమాను కూడా తీసుకోవాలని అటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)గానీ, ఇటు బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐగానీ చెప్పడం లేదు. అయితే మన లాభం కోసం, మన కుటుంబ సభ్యులకు రుణ భారం లేకుండా ఉండేందుకు బీమా తీసుకోవడం ఉత్తమం.

హోమ్ లోన్ ఇన్సూరెన్స్ అంటే?

హోమ్ లోన్ ఇన్సూరెన్స్‌ను హోమ్ లోన్ ప్రొటెక్షన్ ప్లాన్ (హెచ్‌ఎల్‌పీపీ) అని కూడా పిలుస్తారు. ఈ స్కీమ్‌లను అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ బ్యాంకింగ్, నాన్–బ్యాంకింగ్ సంస్థలన్నీ అందిస్తున్నాయి. మరణం, ఆరోగ్యం పాడైపోయి, ఏదైనా కారణం చేత అవయవాలు కోల్పోయి పనిచేయలేని స్థితికి రుణగ్రహీత చేరితే రుణ చెల్లింపుల సంగతిని బీమా సంస్థే చూసుకుంటుంది.

గృహ రుణ బీమా ప్రాముఖ్యత

రుణమిచ్చే బ్యాంకులు లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు.. తమ రుణాలు మొండి బకాయిలుగా మిగిలిపోవాలని చూడవు. అందుకే రుణం తీసుకునేటప్పుడే దానికి బీమా కూడా తీసుకోవాలని రుణగ్రహీతకు ఆయా సంస్థలు చెప్తాయి. దాని ప్రాధాన్యతనూ వివరిస్తాయి. పైగా ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా మునుపెన్నడూ లేనివిధంగా విజృంభించిన కరోనా మహమ్మారి.. మానవుల జీవితాలను ఎంతో ప్రభావితం చేసింది. ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా ఎన్నో విధాలుగా వెనక్కినెట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో రుణ బీమా మన కుటుంబాలకు రక్షగా ఉంటుంది. దురదృష్టవశాత్తు చనిపోయినా, పూర్తిగా అంగవైకల్యం బారినపడ్డా బీమా సంస్థే మన రుణ చెల్లింపుల్ని చేస్తుంది. దీనివల్ల మనం లేనిరోజున మనవాళ్లకు కనీసం సొంత ఇట్లల్లైనా దక్కుతుంది. అలాగే ఉద్యోగం కోల్పోయినా ఆసరాగా ఉంటుంది. అయితే స్టాండర్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను తీసుకోవాలి. మొక్కుబడిగా కాకుండా అన్ని ఫీచర్లున్న బీమాను కొనాలన్నది మర్చిపోవద్దు. గుర్తుంచుకోండి.

ప్రీమియంలు

గృహ రుణ బీమా కవరేజీ ప్రీమియంను ఒకేసారి మొత్తంగా చెల్లించవచ్చు. లేదా హోమ్ లోన్ ఈఎంఐలతోపాటు నెలనెలా కొంత మొత్తాల్లోనూ చెల్లించవచ్చు.

జాయింట్ హౌజ్ లోన్

సంయుక్త గృహ రుణగ్రహీతలకూ ఈ బీమా ఉపయుక్తంగా ఉంటుంది. కో–అప్లికెంట్స్ అందరికీ ఇది వర్తిస్తుంది. అందువల్ల ఒకవేళ కుటుంబంలోని ముగ్గురు కలిసి రుణాన్ని తీసుకున్నా.. వారిలో దురదృష్టవశాత్తు ఒక్కరు అకాల మరణం పాలైనా బీమా కవరేజీని పొందవచ్చు.

రైడర్స్–యాడ్ ఆన్స్

బేసిక్ గృహ రుణ బీమాలో రుణగ్రహీత చనిపోతే చెల్లుబాటు అవుతుంది. అయినప్పటికీ రైడర్ స్కీమ్‌ను యాడ్ చేసుకోవాలంటే అదనపు ప్రీమియం చెల్లించాల్సిందే. రుణగ్రహీతకు గుండెపోటు, క్యాన్సర్, ఇతర ప్రమాదకర గాయాలపాలైనా బీమా వర్తించగలదు. అంగవైకల్యానికి గురైనా లేదా ఉద్యోగం కోల్పోయినా, ఉపాధి కరువైనా 6 నెలలదాకా ఈఎంఐ చెల్లింపులకు యాడ్ ఆన్స్ కవరేజీని ఇవ్వగలవు.

# ఎస్బీఐ ఖాతాదారులకు అలర్ట్.. కేంద్ర ప్రభుత్వం నుంచి హెచ్చరిక

బ్యాంకుల పేరిట ఫేక్ మెసేజ్ లు ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయి. సాధారణంగా బ్యాంకులు తమ ఖాతాదారుల్లో ఇటువంటి స్కామ్ లపై అవగాహన కల్పించేందుకు వినియోగదారులకు కొన్ని మెసేజ్ లు పంపిస్తుంటాయి. ఎటువంటి లింక్స్ ఓపెన్ చేయొద్దు.. మీ పిన్, సీవీవీ వంటి ఎవరికీ చెప్పొద్దు.. అనే మెసేజ్ లు మన ఫోన్ లో చూసే ఉంటాం. ఇప్పుడు ఇలాంటి మెసేజ్ లను కూడా నేరగాళ్లు కాపీ చేస్తున్నారు. ఫేక్ మెసేజ్లు చేస్తూ ఖాతాలను లూటీ చేస్తున్నారు. ఈ మేరకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఓ కీలకమైన ప్రకటనను చేసింది. ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) వినియోగదారులను ఈ మోసపూరిత సందేశాలపై అప్రమత్తం చేసింది. రివార్డు పాయింట్లను రిడీమ్ చేసుకోడానికి కస్టమర్లకు ఏపీకే ఫైల్స్ ను పంపుతూ..దానిని ఇన్ స్టాల్ చేసుకోమని చెబుతున్నారని హెచ్చరించింది. ఆ ఏపీకేని ఇన్ స్టాల్ చేస్తే నేరగాళ్లు సులభంగా మీ ఖాతాలను కొల్లగొట్టేస్తారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం..

రివార్డు పాయింట్ల పేరుతో..

ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎస్బీఐ కస్టమర్లకు చేసిన హెచ్చరిక ప్రకారం.. రివార్డు పాయింట్లను రిడీమ్ చేసుకోడానికి వినియోగదారులకు ఏపీకే ఫైల్ ను డౌన్ లోడ్ చేసుకోమని చెబుతూ ఎస్బీఐ నుంచి వచ్చినట్లుగా ఆ మెసేజ్ ఉంటుంది. అయితే ఆ మెసేజ్ ఫేక్. ఎస్బీఐ ఎప్పుడూ ఎస్ఎంఎస్ లేదా వాట్సాప్ వంటి మాధ్యమాల ద్వారా లింక్లు లేదా ఏపీకే ఫైళ్లను పంపదు. ఒకవేళ మీరు అలాంటి మెసేజ్ స్వీకరిస్తే.. ఇది సైబర్ నేరగాళ్ల పనిగా గుర్తించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ఫైళ్లను డౌన్ లోడ్ చేసుకోకూడదు. ఒకవేళ మీకు అలాంటి మెసేజ్ వచ్చి.. దానిని అనుమానిస్తే.. వెంటనే ఎస్బీఐ అధికారిక చానళ్లలో తనిఖీ చేసుకోవాలి. అలాగే మెసేజ్ తో పాటు వ్యక్తిగత సమాచారాన్ని అడిగినా.. అవతలి వారి ప్రామాణికతను ధ్రువీకరించుకోవాలి. వినియోగదారుల అప్రమత్తత, జాగ్రత్తలే మోసపోకుండా కాపాడుతుందని పీఐబీ పేర్కొంది. 'మీ ఎస్బీఐ నెట్ బ్యాంకింగ్ రివార్డు పాయింట్లు(రూ. 9980.00)నేటితో ఎక్స్ పైర్ అవుతాయి!ఇప్పుడు ఎస్బీఐ రివార్డు యాప్ ద్వారా రిడీమ్ చేసుకోండి. మీ ఖతాలో నగదు డిపాజిట్ చేయడం ద్వారా మీ రివార్డును క్లెయిమ్ చేసుకోండి. మీ రివార్డును క్లెయిమ్ చేసుకొని, ఏపీకే ఫైల్ ని డౌన్ లోడ్ చేసుకోండి.' ఇలాంటి మెసేజ్ గానీ మీరూ స్వీకరిస్తే.. వెంటనే అప్రమత్తం కావాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ లింక్స్ పై క్లిక్ చేయకూడదు.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..

మీకు మెసేజ్ పంపిన వారు ప్రామాణికతను ధ్రువీకరించుకోండి.

ఆ మెసేజ్ బ్యాంక్ అధికారిక కమ్యూనికేషన్ల విధానాల నుంచే వచ్చిందా లేదా అన్నది తనిఖీ చేసుకోండి.

మెసేజ్ రూపంలో వచ్చిన లింక్స్, లేదా మీకు తెలియని లింక్స్ క్లిక్ చేయడం.. అటాచ్ మెంట్లను డౌన్ లోడ్ చేసుకోవడం వంటివి చేయకండి.

మీకు అనుమానిత మెసేజ్ వస్తే.. మీ బ్యాంక్ అధికారిక వెబ్ సైట్ నుంచి కాంటాక్ట్ వివరాలు ఉపయోగించి సంస్థను సంప్రదించండి. లేదా కస్టమర్ కేర్ నంబర్ కు కాల్ చేయండి.

బ్యాంక్ అధికారిక యాప్ లేదా వెబ్ సైట్ల నుంచి మాత్రమే లావాదేవీలు నిర్వహించండి. మీ ఖాతాను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోండి.

మీ ఖాతా లాగిన్ వివరాలను ఎప్పుడూ వేరే వ్యక్తితో పంచుకోవద్దు. పంచుకోవాల్సి వస్తే జాగ్రత్తలు పాటించండి.. ఈ–మెయిల్, ఎస్ఎంఎస్, సోషల్ మీడియా వంటి వాటి ద్వారా అస్సలు షేర్ చేయొద్దు.

ఏదైనా అనుమానాస్పద మెసేజ్లు లేదా ఫిషింగ్ లింక్స్ మీకు వస్తే.. వెంటనే బ్యాంక్ నకు తెలియజేయండి.


# అసోమీలకు 27 వేల కొలువులు ఇవ్వనున్న టాటా..!





ప్రస్తుతం స్మార్ట్ ఫోన్లు మొదలు కార్ల వరకూ.. ప్రతి వస్తువు టెక్నాలజీ ఫీచర్లతోనే వస్తోంది. ఎలక్ట్రానిక్, టెక్నాలజీ వస్తువులు పని చేయాలంటే సెమీ కండక్టర్ చిప్ లు చాలా కీలకం. ఇప్పటి వరకూ తైవాన్ వంటి దేశాల్లోని కంపెనీలే సెమీ కండక్టర్ల తయారీలో కీలక పాత్ర పోషించాయి. కరోనా మహమ్మారి వేళ 'వర్క్ ఫ్రం హోం', 'లెర్న్ ఫ్రం హోం' కారణంగా లాప్ టాప్ లు, కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్లు మొదలు కార్ల వరకూ అన్నింటిలోనూ వాడే సెమి కండక్టర్లకు కొరత ఏర్పడింది. ఫలితంగా కార్ల తయారీ.. డెలివరీ మధ్య గ్యాప్ నెలకొనడంతో సెమీ కండక్టర్ల తయారీ కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో సెమీ కండక్టర్ల తయారీకి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. తదనుగుణంగా దేశీయంగా సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమ వేళ్లూనుకునేందుకు మార్గం సుగమమైంది. టాటా గ్రూప్ అనుబంధ టాటా ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు నిర్మాణం అవుతున్నాయి. ఈశాన్య రాష్ట్రం అసోంలో తొలి సెమీ కండక్టర్ ప్యాక్టరీ నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఈ ఫ్యాక్టరీని దేశంలోనే అతిపెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఒకటైన టాటా గ్రూప్ చేపట్టింది. రూ.27 వేల కోట్ల పెట్టుబడుల అంచనాలతో చిప్ అసెంబ్లింగ్ ప్లాంట్ నిర్మాణం మొదలైంది. ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తయితే దేశీయంగా అభివృద్ధి చెందిన టెక్నాలజీతో రోజూ 4.83 కోట్ల చిప్?లు తయారు చేయొచ్చు. వచ్చే ఏడాది నాటికి ఈ ఫ్యాక్టరీ కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని భావిస్తున్నారు. చిప్‌ల తయారీ మొదలైతే ప్రారంభంలోనే 27 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. టాటా సన్స్ గ్రూప్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ శనివారం మోరిగావ్ జిల్లాలోని జాగిరోడ్డులోని ప్రాజెక్టు సైట్ వద్ద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖరన్ మాట్లాడుతూ ఇప్పటికే అసోం నుంచి వెయ్యి మంది ఉద్యోగులను నియమించుకున్నట్లు తెలిపారు. తమ కంపెనీ యావత్ సెమీ కండక్టర్ ఎకో సిస్టమ్ కంపెనీల విస్తరణకు వసతులు కల్పిస్తుందన్నారు. ప్రత్యక్షంగా 15 వేల మంది, పరోక్షంగా 12 వేల మందికి ఉపాధి లభిస్తుందని చంద్రశేఖరన్ తెలిపారు. శరవేగంగా పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, 2025లో కంపెనీ ఆపరేషన్స్ ప్రారంభిస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు గత ఫిబ్రవరి 29న ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన ఐదు నెలల్లోనే కంపెనీ నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. టాటా చిప్స్ తయారీ ఫ్యాక్టరీ తయారు చేసే చిప్ లను ఎలక్ట్రిక్ వెహికల్స్ తోపాటు అన్ని వాహనాల్లో వాడవచ్చునన్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమ అభివృద్ధికి ఈశాన్య రాష్ట్రాల్లోనే తొమ్మిది సంస్థలు పని చేస్తున్నాయన్నారు. ఎన్ఐటీ సిల్చార్, ఎన్ఐటీ మిజోరం, ఎన్ఐటీ మణిపూర్, ఎన్ఐటీ నాగాలాండ్, ఎన్ఐటీ త్రిపుర, ఎన్ఐటీ అగర్తల, ఎన్ఐటీ సిక్కిం, ఎన్ఐటీ అరుణాచల్ ప్రదేశ్ తోపాటు మేఘాలయలోని నార్త్ ఈస్టర్న్ హిల్ యూనివర్సిటీ, ఎన్ఐటీ సంస్థలు సెమీ కండక్టర్ పరిశ్రమకు అవసరమైన ప్రతిభావంతుల తయారీలో నిమగ్నం అయ్యాయి. మొత్తం 85 వేల మంది నిపుణులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది కేంద్ర ప్రభుత్వం.

# ఈవీ చార్జింగ్ సమస్యకు తెర పడినట్లేనా..?

## కేవలం తొమ్మిది నిమిషాల్లోనే చార్జింగ్.. 1000 కి.మీ దూరం ప్రయాణం.. !



పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటే రీతిలో పెరిగిపోవడంతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం ఆల్టర్నేటివ్ మొబిలిటీ ఆప్షన్ల వైపు యావత్ ప్రపంచం మళ్లుతోంది. ప్రత్యేకించి ఎలక్ట్రిక్ వాహనాల వాడకం వైపు ప్రతి ఒక్కరూ అడుగులేస్తున్నారు. అయితే, పెట్రోల్, డీజిల్ వినియోగ వాహనాలకు ఫ్యుయల్ స్టేషన్ల మాదిరిగా ఈవీ వాహనాలు నడవాలంటే విద్యుత్ అవసరం.. ఈవీ వాహనాల్లోని బ్యాటరీలను విద్యుత్ తో చార్జింగ్ చేస్తేనే నడుపొచ్చు. కానీ, దేశీయంగా.. అంతర్జాతీయంగా ఈవీ చార్జింగ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ వసతులు అంతగా లేవు. కానీ ఇప్పుడు ఆ సమస్యకు పరిష్కారం చెబుతోంది దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్. కేవలం తొమ్మిది నిమిషాల చార్జింగ్‌తో 1000 కి.మీ దూరం ప్రయాణించగల సామర్థ్యం గల బ్యాటరీని ఆవిష్కరించింది శాంసంగ్. సియోల్ లో జరిగిన ఎస్ఎన్ఈ బ్యాటరీ డే –2024 ఎక్స్‌పోలో దీన్ని ప్రదర్శించింది. పూర్తిగా దక్షిణ కొరియా టెక్నాలజీతో అభివృద్ధి చేసిన బ్యాటరీ సక్సెస్ అయితే ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ వెహికల్స్ వైపు అడుగులేయడానికి ఇబ్బందులే ఉండవు. సంప్రదాయ లిథియం అయాన్ బ్యాటరీకి బదులు సాలిడ్ మెటీరియల్‌తోపాటు లిక్విడ్ ఎలక్ట్రోలైట్స్ తో తయారు చేసిన బ్యాటరీ ఇది. ఇది విజయవంతమైతే సేఫ్టీ పెంపుతోపాటు బరువు తగ్గుతుంది. ఎనర్జీ డెన్సిటీ పెంచుతుంది. ప్రస్తుతం ఈవీ కార్లలో వాడుతున్నవి '270 కిలోవాట్స్ ఫర్ కిలో' ఈవీ బ్యాటరీలు. కానీ శాంసంగ్ ఆవిష్కరించిన ప్రొటోటైప్ ఈవీ బ్యాటరీ ఎనర్జీ డెన్సిటీ '500కిలోవాట్స్ ఫర్ కిలో'. అంతే కాదు ఈ బ్యాటరీల లైఫ్ స్పాన్ 20 ఏండ్లు ఉంటుంది. ప్రస్తుతం ఈవీ బ్యాటరీల చార్జింగ్ కోసం ఒక్కో వాహనానికి 30 నిమిషాల నుంచి కొన్ని నిమిషాలు పడుతుంది. అదీ కూడా బ్యాటరీ కెపాసిటీ, చార్జింగ్ స్టేషన్ బట్టి ఉంటుంది. ప్రస్తుతం భారత్ లో టాటా నెక్సాన్ ఈవీ, ఎంజీ జడ్ఎస్ ఈవీ వంటి రెండు పాపులర్ మోడల్ కార్ల బ్యాటరీలను ఫాస్ట్ చార్జర్ల సాయంతో 80 శాతం చార్జింగ్ చేయాలన్నా సుమారు 60 నిమిషాల టైం పడుతుంది. 2027 నాటికి భారీ స్థాయిలో ఆల్ సాలిడ్ స్టేట్ బ్యాటరీలను నిర్మించడానికి గతేడాది పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాం అని శాంసంగ్ ఎస్డీఐ తెలిపింది. తొలి దశలో తయారు చేసిన బ్యాటరీలను ప్రయోగాత్మకంగా పరీక్షించడానికి డెలివరీ చేశామని, వాటి వినియోగంపై యూజర్ల నుంచి అద్భుతమైన పాజిటివ్ ప్రతిస్పందన వచ్చిందని సమాచారం. దేశీయ ఈవీ టూ వీలర్స్ తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ కూడా మెరుగైన ఈవీ బ్యాటరీలను, వాటికి అవసరమైన చార్జర్లను ప్రయోగాత్మకంగా పరీక్షించినట్లు తెలుస్తున్నది.




# మొక్కలు నాటితే.. 'సింబా' టికెట్లు ఫ్రీ




జగపతి బాబు, అనసూయ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింబా'. ఆగస్ట్ 9న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ క్రమంలో ఇటీవల ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అతిథులు ప్రేక్షకులకు మంచి ఆఫర్ ఇచ్చారు. జగపతి బాబు, అనసూయ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింబా' సంపత్ నంది టీం వర్క్స్, రాజ్ దాసరి ప్రొడక్షన్స్ బ్యానర్లపై సంపత్ నంది, దాసరి రాజేందర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. సంపత్ నంది అందించిన ఈ కథకు మురళీ మనోహర్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఆగస్ట్ 9న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ క్రమంలో ఇటీవల ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్, ఎమ్మెల్యే విజయ రమణారావు, రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంపత్ నంది మాట్లాడుతూ.. ఈ సినిమా కథ అందరికీ కనువిప్పు కలిగేలా, ఎంటర్టైన్ చేసేలా, మంచి సందేశం ఇచ్చేలా ఉంటుంది. నేను మా నిర్మాత రాజేందర్ రెడ్డికి మంచి మాస్ కమర్షియల్ కథలు చెప్పా.. లాభాలు వస్తాయని చెప్పా. కానీ మా నిర్మాత మాత్రం సింబా కథను ఎంచుకున్నారు. సమాజానికి మంచి చేయాలనే, ఏదైనా తిరిగి ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ చిత్రం చేశారు. అలాంటి మంచి వ్యక్తి కోసం ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలి. సినిమా నిర్మాణంలో సాయం చేసిన పూర్ణ, రాఘవ గారికి థాంక్స్. సైంటిఫిక్‌గా హెల్ప్ చేసిన కిషోర్, స్క్రిప్ట్ ఐడియా ఇచ్చిన విజయ్‌లకు థాంక్స్. ఈ సినిమాను చూస్తే వందకు వంద మార్కులు వేస్తారు' అని అన్నారు. నిర్మాత రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. 'వనజీవి రామయ్య గారు కోటికి పైగా మొక్కలు నాటారు. స్కూల్ పుస్తకాల్లో వీరి మీద పాఠాలున్నాయి. వీళ్లని చూసి ఇన్‌స్పైర్ అయి ఈ కథను రాసుకున్నాం. ప్రకృతి లేకపోతే మనం ఉండలేం. ప్రకృతికి కోపం వస్తే ఎలా ఉంటుందో అందరికీ తెలుసు. ఆగస్ట్ 22న చిరంజీవి గారికి పుట్టిన రోజున కొన్ని వేల మొక్కల్ని ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. మా ఊర్లోనూ మొక్కలు నాటుతున్నాం. ఈ సినిమాకు వచ్చే లాభాలను కూడా మొక్కల రూపంలోనే ఖర్చు పెట్టాలని అనుకుంటున్నాం. ఇప్పటి వరకు ఇలాంటి కాన్సెప్ట్‌తో ఇండియన్ స్క్రీన్ మీద సినిమా రాలేదు. ఆగస్ట్ 9న మా చిత్రం రాబోతోంది. అందరూ చూడండి' అని అన్నారు. దర్శకుడు మురళీ మనోహర్ మాట్లాడుతూ.. 'సింబా చాలా కొత్త కథ, కొత్త పాయింట్‌తో రాబోతోంది. సంపత్ నంది గారు అద్భుతంగా కథ రాశారు. ఇంత మంచి ప్రాజెక్ట్‌ను రాజేందర్ గారు నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ఆయన విజన్‌కు హ్యాట్సాఫ్. ఎల్లప్పుడూ మా వెంట ఉండి సహకారం అందించారు. నాకు ఈ ప్రయాణంలో తోడుగా నిలిచిన నా ఫ్యామిలీకి, టీంకు థాంక్స్. ఆగస్ట్ 9న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి ఆదరించండి' అని అన్నారు. నటుడు శ్రీనాథ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎవరైనా తమ తమ ప్రాంతాల్లో మొక్కలు నాటి మాకు మెసేజ్ పెడితే టికెట్లు ఫ్రీగా ఇస్తానని ఆఫర్ ఇచ్చాడు. అదే సమయంలో అతిథిగా వచ్చిన మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ కూడా స్పందిస్తూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలు వారికి నేను కూడా టికెట్లు అందజేస్తానని ప్రకటించారు.

# సినీతారలు.. ఫ్రెండ్‌షిప్ డే ముచ్చట్లు!




'ట్రెండు మారినా ఫ్రెండ్ మారడే... ఎండ్ కానీ బాండ్ పేరు ఫ్రెండ్‌షిప్పే' అన్నాడో సినీ కవి. 'నిజమే.. నోట్‌బుక్ నుంచి ఫేస్‌బుక్‌కి మారినా.. ఫ్రెండ్ అన్న మాటలోన ఫీలింగ్ మారునా?' అంటున్నారు మన సెలబ్రిటీలు. నేడు 'స్నేహితుల దినోత్సవం' సందర్భంగా తమ 'బెస్ట్ ఫ్రెండ్' గురించి కొందరు సినీతారలు ఏం చెబుతున్నారంటే...

**అది నా అదృష్టం**

స్నేహం అనేది మనం కొనలేని, అమ్మలేని అమూల్యమైన బహుమతి. ప్రతీ మనిషి జీవితంలో ప్రతి దశలోనూ స్నేహితులుంటారు. కానీ అన్ని దశల్లోనూ ఒక్కరే ఉండటం అదృష్టం అనేది నా అభిప్రాయం. నా లైఫ్‌లో అలాంటి వ్యక్తే స్వాతి. నాలాగే తనకి కూడా ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. అందుకే నాకు ఖాళీ సమయం దొరికినప్పుడల్లా ఇద్దరం కలిసి గుడులు, గోపురాలంటూ తిరుగుతుంటాం. బయట ప్రపంచాన్ని మరిచిపోయి మరీ గంటల తరబడి ముచ్చట్లతోనే గడిపేస్తాం. చిన్నప్పటి నుంచి మేము బడ్డీస్ కాబట్టి తనని మా ఇంట్లో మనిషిలానే చూస్తారు మావాళ్లంతా.

– సాయిపల్లవి

**ఇండస్ట్రీకి రాకముందే...**

నేను, వాణీకపూర్ ఇప్పుడు కాదు... ఇండస్ట్రీకి రాకముందు నుంచే మంచి స్నేహితులం. నిజానికి నేను హీరోయిన్‌గా మీ అందరి ప్రేమానురాగాలు పొందుతున్నానంటే దానికి పరోక్ష కారణం ఆమే. తన ప్రోత్సాహం వల్లే నేను సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టా. కెరీర్‌లో జయాపజయాలు, ఎత్తుపల్లాలు ఎదురైన సమయాల్లోనూ ఒకరికొకరం తోడుగా నిలిచాం. ఇన్నేళ్ల మా స్నేహబంధంలో ఈనాటికీ ఏ రోజూ మా మధ్య ఎలాంటి మనస్పర్థలు రాలేదు. మా ఇద్దరికీ ఒకరిపై ఒకరికున్న నమ్మకం, గౌరవం అలాంటిది. తను నా స్నేహితురాలే కాదు... సోదరిలాంటిది కూడా.

**ఇరవయ్యేళ్ల స్నేహం**

నాకున్న కొద్దిమంది స్నేహితుల్లో తమన్నా ఒకరు. మా స్నేహానికి రెండు దశాబ్దాల చరిత్ర ఉంది. మొదట్లో రూమ్‌మేట్స్‌గా పరిచయమయ్యాం. అప్పట్లో మా ఇద్దరికీ అస్సలు పడేది కాదు. ఎడముఖం, పెడముఖం అన్నట్లుగానే ఉండేవాళ్లం. కానీ తర్వాత ప్రాణ స్నేహితులుగా మారిపోయాం. నేను ఎంత బిజీగా ఉన్నా కూడా తన కోసం ప్రత్యేకించి సమయం కేటాయిస్తా. ఇద్దరం కలసి పిల్లలను వెంటబెట్టుకుని తరచుగా ట్రిప్‌లకు వెళ్తుంటాం. నిజానికి ఇప్పుడు నేను, తమన్నానే కాదు... మా భర్తలు కూడా మంచి స్నేహితులైపోయారు.

– ప్రియాంక చోప్రా

**అన్నీ చెల్లెలే...**


నాకు బెస్ట్ ఫ్రెండ్ అయినా, శ్రేయోభిలాషైనా నా చెల్లి నుపూర్ సననే. అమ్మానాన్నలతో కూడా షేర్ చేసుకోలేని విషయాలను నా చెల్లితో మనసు విప్పి చెప్పుకోగలను. మా ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం అలాంటిది. మా మధ్య ఎలాంటి సీక్రెట్స్ ఉండవు. ప్రతీ విషయం కూడా ఒకరికొకరం పంచుకుంటాం. నేను షూటింగ్స్‌లో ఉన్నా కూడా రోజుకి ఒక్కసారైనా చెల్లితో వీడియోకాల్ మాట్లాడాల్సిందే. లేదంటే మనసు లాగేసినట్లుంటుంది. ఇక ఇద్దరం ఇంట్లోనే ఉంటే మాత్రం ఓ రేంజ్‌లో అల్లరి చేస్తాం.

– కృతిసనన్

**ఒకే కంచం, ఒకే మంచం**

సంగీత దర్శకుడు రోచక్ కోహ్లీ, నేను ఎనిమిదో తరగతి నుంచే స్నేహితులం. మా ఇద్దరిదీ ఒకే కంచం, ఒకే మంచం అన్నమాట. అప్పట్లో మా ఇద్దరికీ సంగీతం అంటే పిచ్చి. స్కూలుకి బంక్ కొట్టి మరీ పాటలను కంపోజ్ చేసేవాళ్లం. స్కూల్‌లో ఏ కార్యక్రమం జరిగినా మా సంగీత ప్రదర్శన కచ్చితంగా ఉండేది. కాలేజీలో అడుగుపెట్టాక 'ఆఘాజ్' అనే థియేటర్ గ్రూప్‌ని ప్రారంభించి నాటక ప్రదర్శనలు ఇచ్చేవాళ్లం. అలా మొదటి నుంచి చదువుపై కన్నా సృజనాత్మకత వైపే మొగ్గు చూపేవాళ్లం. రోచక్ చాలా ప్రతిభావంతుడు.

# అనల్ అరసు సూపర్ విజన్.. మెగాస్టార్ యాక్షన్!



మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ సోషియో-ఫాంటసీ ఎంటర్‌టైనర్ చిత్రం 'విశ్వంభర'. ఈ చిత్రాన్ని సంక్రాంతి రిలీజ్‌కి సిద్ధం చేస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ సహా ప్రొడక్షన్ పనులు జరుగుతున్న ఈ సినిమా షెడ్యూల్ ప్రకారం ముందుకు నడుస్తోంది. హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చిత్రీకరణ జరుపుకుంటున్న 'విశ్వంభర' చిత్రం ప్రస్తుతం క్లైమాక్స్‌కు చేరుకుంది. ఈ క్లైమాక్స్‌కి ఇండియన్ టాప్ యాక్షన్ కొరియోగ్రాఫర్ అనల్ అరసు యాక్షన్ డిజైన్ చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ సోషియో-ఫాంటసీ ఎంటర్‌టైనర్ చిత్రం 'విశ్వంభర'. ఈ చిత్రాన్ని సంక్రాంతి రిలీజ్‌కి సిద్ధం చేస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ సహా ప్రొడక్షన్ పనులు జరుగుతున్న ఈ సినిమా షెడ్యూల్ ప్రకారం ముందుకు నడుస్తోంది. హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చిత్రీకరణ జరుపుకుంటున్న 'విశ్వంభర' చిత్రం ప్రస్తుతం క్లైమాక్స్‌కు చేరుకుంది. ఈ క్లైమాక్స్ సీక్వెన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజువల్ వండర్‌గా వుండబోతోందని.. వశిష్ట క్రియేటివ్ అప్రోచ్‌తో ఫాంటసీ ఎలిమెంట్స్‌ని విజువల్ గా మహాఅద్భుతంగా ప్రజెంట్ చేస్తున్నారు. ఈ ఇంటెన్స్ క్లైమాక్స్‌కి ఇండియన్ టాప్ యాక్షన్ కొరియోగ్రాఫర్ అయినటువంటి అనల్ అరసు యాక్షన్ డిజైన్ చేస్తున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. తన అద్భుతమైన యాక్షన్ కొరియోగ్రఫీతో క్లైమాక్స్ అవుట్ స్టాండింగ్‌గా వుండబోతోందని, క్లైమాక్స్ ప్రేక్షకుల అంచనాలను మించి వుంటుందని మేకర్స్ చెబుతున్నారు. క్లైమాక్స్ సీక్వెన్స్ స్కేల్, స్కోప్ చాలా గ్రాండ్‌గా వుంటాయని.. ఇందులో మ్యాసీవ్ సెట్‌లు, విజువల్ ఎఫెక్ట్‌లతో మూవీ ఫాంటసీ నెక్స్ట్ లెవల్ వుండబోతున్నట్లుగా వెల్లడించారు. ఈ క్లైమాక్స్ షోడౌన్‌లో చిరంజీవి చరిష్మాటిక్ ప్రజెన్స్‌తో విశ్వంభర మునుపెన్నడూ లేని ఎక్స్‌పీరియన్స్‌ని అందించడానికి సిద్ధంగా వుంది. టాలీవుడ్ నిర్మాణ సంస్థ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాతలు విక్రమ్, వంశీ, ప్రమోద్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'విశ్వంభర'లో ప్రముఖ నటీనటులు, టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, ఆషికా రంగనాథ్ కీలక పాత్రలు పోషిస్తుండగా, కునాల్ కపూర్ పవర్ ఫుల్ రోల్‌లో కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఛోటా కె నాయుడు సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. ఈ సినిమాను 10 జనవరి, 2025న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకురాబోతున్నారు.

# సంయుక్త.. నిండైన చీరలో ఎంత గ్లామరో..




సంయుక్త మీనన్ టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ ను అందుకుంటోంది. తెలుగులో ఆమెకు "భీమ్లా నాయక్" సినిమా ద్వారా పెద్ద బ్రేక్ వచ్చింది. ఈ సినిమాలో ఆమె తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ సినిమా విజయంతో, సంయుక్తకు టాలీవుడ్‌లో వరుసగా మంచి అవకాశాలు లభించాయి. "భీమ్లా నాయక్" తర్వాత సంయుక్త "బింబిసార", "సార్", "విరూపాక్ష" వంటి చిత్రాలలో నటించి బ్లాక్ బస్టర్ హిట్లు అందుకుంది. ఈ విజయాలతో సంయుక్త టాలీవుడ్‌లో ఒక గోల్డెన్ బ్యూటీగా మారిపోయింది. చాలా తక్కువ సమయంలోనే తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరైంది. ప్రస్తుతం నిఖిల్ సరసన "స్వయంభూ" చిత్రంలో నటిస్తూ, మరోసారి తన ప్రతిభను నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉంది. సంయుక్త టాలీవుడ్‌లో మాత్రమే కాకుండా మాలీవుడ్‌లో కూడా తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంది. ఈ బ్యూటీ ఇటీవలే బాలీవుడ్‌లో కూడా అడుగు పెట్టింది. చరణ్ తేజ్ ఉప్పాలపాటి దర్శకత్వంలో రూపొందుతున్న "మహారాగ్ని" సినిమాలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా నుంచి విడుదలైన గ్లింప్స్‌లో ఆమె కారు రేసింగ్ సీక్వెన్స్‌లో, గ్లామరస్ లుక్‌లో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, సంయుక్త సోషల్ మీడియాలో తన ఫ్యాన్స్‌తో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటుంది. తన ఫోటోషూట్స్ ద్వారా ఆమె గ్లామర్ షో చేస్తూ అభిమానులను అలరిస్తుంది. ఏ దుస్తులలోనైనా, అది చీరల్లోనైనా, మోడ్రన్ డ్రెస్సుల్లోనైనా, ఆమె తన అందం, క్యూట్ నెస్‌ను ఏ మాత్రం తగ్గకుండా చూపిస్తుంది. ఈ మధ్య కాలంలో ఆమె షేర్ చేసిన గ్రీన్ కలర్ కలర్ ప్లెయిన్ శారీలో దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పొట్టి గౌనులో వర్షంలో చిందులేస్తూ.. ఆ ఫోటోల్లో ఆమె స్లీవ్ లెస్ బ్లౌజ్‌తో, క్రేజీ నెక్ సెట్ ధరించి స్టన్నింగ్ లుక్‌లో కనిపిస్తోంది. శారీ పైటను కాస్త పక్కకు వేసుకుని, ఎద అందాలను హైలైట్ చేస్తూ క్లాసీగా కనిపిస్తూ, మరింత గ్లామర్‌ను చూపిస్తోంది. అందం విషయంలో సంయుక్త తనకంటూ ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్‌ను సొంతం చేసుకుంది. సినిమాలతో మాత్రమే కాకుండా, సోషల్ మీడియాలో కూడా తన అభిమానులను పెంచుకుంటూ, ప్రతి రోజూ కొత్త కొత్త ఫాలోవర్స్‌ను పొందుతోంది. మరి ఆమె కెరీర్ కు ఈ క్రేజ్ ఎంతవరకు హెల్ప్ అవుతుందో చూడాలి.

# షామా స్టన్నింగ్ ఫోటోషూట్ వైరల్



షామా శికందర్ పరిచయం అవసరం లేదు. సోషల్ మీడియా యాక్టివిస్ట్.. ఫోటోషూట్లతో దుమారం రేపడం ఈ అమ్మడి ప్రత్యేకత. నెట్టింట కొత్త ఫోటోషూట్‌లతో ఈ బ్యూటీ అగ్గి రాజేస్తుంటుంది. బోల్డ్ డస్కీ లుక్స్ తో హృదయాల్ని టచ్ చేసే ఈ భామ బర్త్ డే నేడు. ఈ సందర్భంగా తన ప్రేమికుడి గురించిన ఎమోషనల్ నోట్ ఇప్పుడు అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. ఈ పోస్ట్ సారాంశం ఇలా ఉంది. ఈ సంవత్సరం సవాలుతో కూడుకున్నదని నాకు తెలుసు.. కానీ మీరు ఒక ఛాంపియన్‌గా దాన్ని ఎదుర్కొన్నారు. నేను మీ కష్టాలు పతనాలను చూస్తున్నాను. నేను మీ బాధను పురోగతిని చూస్తున్నాను.. నేను మీరు చేసే ప్రతిదాన్ని చూస్తున్నాను.. నేను మీ దుర్బలత్వాన్ని చూస్తున్నాను.. నేను మీ ధైర్యాన్ని చూస్తున్నాను.. నేను మీ బలాలు బలహీనతలను చూస్తున్నాను..నేను ఎంతగానో చెప్పలేను.. నీకు విలువ ఇస్తాను, నిన్ను ప్రేమిస్తున్నాను.. నిన్ను గౌరవిస్తాను. ఇంతకీ ఆర్జీవీ చెప్పిన ఆ తెలుగు 'బిగ్ స్టార్' ఎవరబ్బా? మీరు నాకు అత్యంత విలువైనవారు.. మీ ద్వారా ఈ జీవిత అనుభవాన్ని గడపడం అత్యంత ఉత్తేజకరమైన ఆనందదాయకమైన ప్రయాణం. నేను నీతో చాలా ప్రేమలో ఉన్నాను. జీవితాన్ని అత్యంత ప్రామాణికంగా నిజాయితీగా జీవించాలనే మీ ఉత్సుకత నన్ను ఉత్తేజపరచడమే కాకుండా నా హృదయాన్ని నింపుతుంది. నేను మీ ప్రామాణికత, సానుభూతి, చిత్తశుద్ధి, కృతజ్ఞత, దయ, దయ, ధైర్యాన్ని చూస్తున్నాను.. ప్రేమిస్తున్నాను.. గౌరవిస్తాను.. విలువైనదిగా భావిస్తున్నాను. మీరు చాలా ప్రేమ, గౌరవం, నిజాయితీ, విలువ, దయ, కృతజ్ఞతతో మీ లోపల చుట్టూ ఉన్న ప్రతిదీ కలిగి ఉంటారు. మీలాంటి వారిని నేను ఎప్పుడూ చూడలేదు.. మీరు నిజంగా అద్వితీయులు అద్భుతమైనవారు.. మీ సంపూర్ణతకు నేను లొంగిపోతున్నాను.. మీలోని మేధావికి నేను లొంగిపోతున్నాను.. మీలోని దైవత్వానికి నేను నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీరు నా అనుభవంలోకి తెచ్చిన ప్రతి అనుభవంతో మీ ద్వారా ఈ జీవితాన్ని అనుభవించడానికి నేను ఈ ప్రపంచంలో జన్మించినందుకు నేను చాలా కృతజ్ఞురాలిని. నేను మీ గురించి చాలా గర్వపడుతున్నాను. నీ అందానికి నేను చాలా అణకువగా ఉన్నాను నేను మీకు చాలా కృతజ్ఞుడను నేను కావాలని కోరుకునేదంతా నువ్వే మీరు నాకు చాలా ప్రియమైనవారు అంటూ కవితలు అల్లింది షామా... జన్మదిన శుభాకాంక్షలు దేవా బిడ్డ!! అంటూ తనకు తానే బర్త్ డే విషెస్ చెప్పుకుంది. యే మేరీ లైఫ్ హై ఫేమ్.. టీవీ నటి షామా అమెరికా.. న్యూయార్క్.. ముంబై అంటూ అన్నిచోట్లా షికార్లతో టచ్ లోనే ఉంది ఈ భామ. కాబోయే భర్త జేమ్స్ మిల్లిరోన్ తో రొమాంటిక్ డేట్ లో ఉన్న ఈ బ్యూటీ వెండితెరపై నటిగా ప్రయత్నాల్ని మాత్రం విడిచిపెట్టడం లేదు. షామా తదుపరి ఉత్తరాది టీవీ మూవీ రంగాలతో పాటు సౌత్ సినీపరిశ్రమలపైనా దృష్టి సారించింది. తదుపరి ప్రాజెక్టుల గురించి ప్రకటించాల్సి ఉంది.

# అనసూయ హొయలు ఆ డ్రెస్సుకే అందం



యాంకర్ గా కెరియర్ స్టార్ట్ చేసిన అనసూయ క్షణం సినిమాతో మొదట నటిగా మంచి గుర్తింపు అందుకుంది. అంతకుముందు సోగ్గాడే చిన్ని నాయనా సినిమాలో గెస్ట్ అప్పీరియన్స్ ఇచ్చింది. ఇక రంగస్థలం సినిమాలో రంగమ్మత్త పాత్ర అయితే అనసూయని ఏకంగా స్టార్ యాక్టర్ గా మార్చేసింది. అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేకుండా వరుస సినిమాలతో అనసూయ బిజీ అయిపోయింది. అనసూయ నటించిన సింబ మూవీ రిలీజ్ కి రెడీ అవుతోంది. రీసెంట్ గా ఈ మూవీ ట్రైలర్ ప్రేక్షకుల ముందుకొచ్చింది. అలాగే పుష్ప ది రూల్ మూవీలో నటిస్తోంది. దాంతో పాటు ఫ్లాష్ బ్యాక్, ఉల్ఫ్ అని రెండు సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి. కొన్ని మూవీస్ చర్చల దశలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓ వైపు సినిమాలు చేస్తూనే అనసూయ టీవీ షోలకి జడ్జ్ గా ఈ మధ్యకాలంలో వస్తోంది. గతంలో హోస్ట్ గా అనసూయ చేసేది. పూర్తిగా యాంకరింగ్ కి గుడ్ బై చెప్పేసిన అనసూయ జడ్జ్ గా ప్రమోట్ అయ్యింది. స్టార్ మాలో శని, ఆదివారాలు ప్రసారం అయ్యే కిర్రాక్ బాయ్స్ ఖిలాడీ గర్ల్స్ అనే షోకి జడ్జ్ గా అనసూయ వస్తోంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడు చాలా యాక్టివ్ గా ఉంటుంది. ముఖ్యంగా ఇన్ స్టాగ్రామ్ లో రెగ్యులర్ గా తన గ్లామర్ ఫోటోలని అనసూయ షేర్ చేసుకుంటూ ఉంటుంది.

# ప్రతి ఇల్లు, గ్రామం, పట్టణం స్వచ్ఛంగా.. పచ్చగా ఉండాలి



ముస్తాబాద్, ఆగస్టు 5 : ప్రతి ఇల్లు, గ్రామం, పట్టణం స్వచ్ఛంగా.. పచ్చగా ఉండాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పచ్చదనం.. స్వచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ముస్తాబాద్ లో కార్యక్రమాన్ని చేపట్టగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. అనంతరం ముస్తాబాద్ కొత్త బస్టాండ్ నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం దాకా చేపట్టిన ర్యాలీ లో పాల్గొన్న కలెక్టర్, డీపీఓ వీర బుచ్చయ్య, మహిళా సంఘాల బాధ్యులు, విద్యార్థులు పాల్గొని, నినాదాలు చేశారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు రూపొందించిన పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగాహా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూహా పారిశుద్ధ్య నిర్వహణ పచ్చధనం పెంపు లక్ష్యాలతో ప్రభుత్వం ఆగస్టు 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని అమలు చేస్తుందని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు వారం లో రెండు రోజులు డ్రై డే గా పాటించాలని, ఇంట్లోని పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్హా వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని, ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం ద్వారా మన ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుతామో అదే విధంగా మన గ్రామాన్ని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. డెంగ్యూ వ్యాధి నియంత్రణలో జిల్లా పనితీరు మెరుగ్గా ఉందని, భవిష్యత్తు లోనూ ఇదే స్ఫూర్తి కొనసాగించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.హాహా అవెన్యూ ప్లాంటేషన్ కిందహా ఎత్తైన మొక్కలు మన నర్సరీల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు .విద్యుత్ లైన్లు, త్రాగునీటి సరఫరా పైప్ లైన్లకు దూరంగా అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు. ముస్తాబాద్ తహసిల్దార్ కార్యాలయ తరలింపు కోసం ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.హా ప్రత్యామ్నాయ ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంటే ఎస్సీ కాలనీ లోని డంపింగ్ యార్డ్ తరలింపు సాధ్యా సాధ్యలపై నివేదికను వారం రోజుల్లో సమర్పించాలని కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారిని సూచించారు. డ్రైనేజీ వాటర్హామానేరు నదిలో కల్వకుండా కమ్యూనిటి సోప్ కిట్ నిర్మించాలని కలెక్టర్ సూచించారు.హా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవసరమైన భూమి గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో మంచి ఫలితాలు సాధించాలని, నర్సరీ లో మంచి మొక్కలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన మేర గ్రామంలో పచ్చదనం పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని అన్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాలను ప్రతి రోజు పక్కాగా నిర్వహించి రాష్ట్రంలోనే మన జిల్లా ప్రథమ స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలని , ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో తగ్గించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, చిన్నతనం నుంచే పారిశుధ్య నిర్వహణ పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలనిహా ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం కే కే మహేందర్ మాట్లాడారు. అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం,హా చెట్లు లేకపోవడం వల్ల గ్రామంలోహాహా కోతుల సమస్యలు కూడా పెరుగుతున్నాయని అన్నారు.హా స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం ద్వారా ఆరోగ్య తెలంగాణ సాధ్యమవుతుందని ఆ దిశగా మనమంతా కృషి చేయాలని అన్నారు. సిరిసిల్ల ప్రాంతంలో వర్షా బావ పరిస్థితుల వల్ల నేటి సమస్య ఉండేదని, గతంలోహా దీని నియంత్రించేందుకు నిజాం ప్రభుత్వం అపర్ మానేర్ ప్రాజెక్టు నిర్మించిందని, మనం వీలైనంత ఎక్కువ చెట్లు నాటడం వల్ల మనకు అంత మంచి జరుగుతుందని అన్నారు. అనంతరం ఎగువ మానేరు నుంచి ముస్తాబాద్ మండలానికి వచ్చే కాలువ లో మురుగు నీరు కలుస్తున్న ప్రదేశాన్ని పరిశీలించి, నీరు దానిలో కలువకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి రైతు వేదిక వద్ద తహసిల్దార్ కార్యాలయానికి సంబంధించి నిర్మాణాన్ని పరిశీలించారు. కలెక్టర్ ముస్తాబాద్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతులు కొనసాగుతుండగా పరిశీలించారు. అదే ఆవరణలోని బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించి ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని, ఎన్ని తరగతి గదులు ఉన్నాయో అడుగగా, మొత్తం 16 తరగతి గదులు, 120 మంది విద్యార్థులు చదువుతున్నారని అధికారులు తెలిపారు. ఈ రెండు స్కూల్స్ లో కావాల్సిన వసతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతి గదులు పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించగా, స్కూల్ ఆవరణలో నీరు నిలువకుండా కచ్చా కలువ నిర్మించాలని, ఆవరణ శుభ్రం చేసి మొక్కలు నాటించాలని డీఆర్డీఓ శేషాద్రిని కలెక్టర్ ఆదేశించారు. తరగతి గదులు పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం డైనింగ్ హాల్ లో సిద్ధంగా ఉన్నా ఆహార పదార్థాలు పరిశీలించారు. మెనూ ప్రకారం అందుస్తున్నరా అని విద్యాలయం బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ డీఈఓ రమేష్ కుమార్, జిల్లా ఉద్యానవన అధికారి, మండల ప్రత్యేక అధికారి లత, సెస్ డైరెక్టర్ అంజి రెడ్డి, తహసిల్దార్ సురేష్, ఎంపీడీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ ఫలాలు రైతులకు చేరేలా పటిష్ట చర్యలు - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి, ఆగస్టు -05: ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ పథకం ఫలాలు సంబంధిత లబ్ధిదారులైన రైతులకు చేరే విధంగా బ్యాంకర్లు పట్టిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బ్యాంకర్లను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రైతు రుణమాఫీ, ఇందిరా మహిళా శక్తి, తదితర అంశాల పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి బ్యాంకర్లతో డీసీసీ ,డీ.ఎల్.ఆర్.సి సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ మాట్లాడుతూ, 2 లక్షల రుణమాఫీలో భాగంగా ప్రభుత్వం రెండు విడుతలలో లక్షన్నర వరకు రుణాలు ఉన్న రైతుల రుణాలను మాఫీ చేస్తూ నిధులు విడుదల చేశాయని, మన పెద్దపల్లి జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 42 వేల 965 మంది రైతులకు దాదాపు 271 కోట్ల రుణమాఫీ జరిగిందని అన్నారు. ప్రభుత్వ రైతుల రుణాలు మాఫీ చేస్తూ నిధులు విడుదల చేసినందున రుణమాఫీ ఫలాలు సదరు రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రుణమాఫీ లబ్ధిదారులకు సంబంధించిన రుణాలు పూర్తి స్థాయిలో రెన్యూవల్ చేయాలని, ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకుల్లో రుణమాఫీ రైతుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. రుణమాఫీ సంబంధించి మండలంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదు కేంద్రాల ద్వారా రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1864 కోట్ల రూపాయల పంట రుణ లక్ష్యానికి జూన్ చివరి నాటికి 266 కోట్లు, 651 కోట్ల రూపాయల వ్యవసాయ టర్మ్ రుణాలకు గాను దాదాపు 154 కోట్ల రుణాలు అందించామని అధికారులు తెలిపారు. రైతు రుణమాఫీ ప్రభుత్వం పూర్తి చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న పంట రుణ లక్ష్యాలను నూరు శాతం చేరుకోవాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూలై నాటికి 948 స్వశక్తి సంఘాలకు 81 కోట్ల 25 లక్షలు, మెప్మా కింద 91 సంఘాలకు 10 కోట్ల 63 లక్షల బ్యాంకు రుణాలు అందించామని అధికారులు తెలిపారు. జూలై మాసం చివరి నాటికి నిర్దేశించుకున్న లక్ష్యంలో 60 శాతం మాత్రమే పూర్తి కావడానికి గల కారణాలను కలెక్టర్ ఆరా తీశారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళా సంఘాల చే వివిధ రకాల వ్యాపార వాణిజ్య యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని, దీనికి సంబంధించి బ్యాంకర్లు సంపూర్ణంగా తమ సహకారం అందజేసి అవసరమైన రుణాలను అందజేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ప్రధానమంత్రి స్వానిది క్రింద రెండవ సారి 8 వేల 368 మందికి పంపిణీ చేశామని, ఆర్.పి లు, బ్యాంకర్లు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పీఎం స్వానిధి రెండో విడత కింద తిరిగి చెల్లించిన వారికి మూడవ విడత రుణాలు మంజూరు అయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మెప్మా ఆర్.పి లు పీఎం స్వానిధి రుణాల మొండి బకాయిల రికవరీ పై శ్రద్ద వహించాలని అన్నారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు వివిధ పథకాల క్రింద యువతకు రుణాలు అందించాలని, స్టాండ్ అప్ ఇండియా క్రింద ఇప్పటి వరకు 84 యూనిట్లకు 1649 కోట్ల రుణాలు మంజూరు చేసి 470 మందికి ఉపాధి కల్పించామని, ముద్రా రుణాల కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2 వేల 145 మంది లబ్ధిదారులకు 27 కోట్ల 81 లక్షల రుణాలు అందించామని తెలిపారు. యువతకు ఉపాధి అందించే విషయంలో అధికారులు చొరవ చూపాలని , ఈ పథకాల పై విస్తృతంగా ప్రచారం కల్పించాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తూ ఉపాధి కల్పించే దిశగా యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించిందని, దీనికోసం వచ్చే ఐదు సంవత్సరాల కాలానికి 13 వేల కోట్లు నిధులను కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకం పట్ల విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, జిల్లాలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల స్క్రూటినీ ప్రక్రియ నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన వారందరికీ పథకం అమలు అయ్యే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్ , డి .ఆర్.డి ఓ.రవీందర్ రాథోడ్, వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్ లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణ, గ్రీనరీ పెంపు లక్ష్యాలుగా స్వచ్ఛదనం -పచ్చదనం : జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, ఆగస్టు -05: పారిశుద్ధ్య నిర్వహణ, గ్రీనరీ పెంపు లక్ష్యాలుగా ప్రభుత్వం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించిందని, మన జిల్లాలో ఈ కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని పెద్దపల్లి పట్టణంలో ప్రారంభించారు. పెద్దపెల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి అమర్ నగర్ చౌరస్తా , మసీదు, జెండా, సివిల్ ఆసుపత్రి మీదుగా మళ్లీ ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు చేపట్టిన స్వచ్ఛదనం – పచ్చదనం అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం క్రింద ఆగస్టు 5 నుంచి 9 వరకు చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలను మున్సిపల్ కమిషనర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ గ్రీనరీ పెంపు లక్ష్యాలతో ప్రభుత్వం ఆగస్టు 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలను పెద్ద ఎత్తున భాగవతం చేయాలని లక్ష్యంతో ముందస్తుగా ర్యాలీ చేపట్టామని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛదనం – పచ్చదనం ర్యాలీలో వివిధ పాఠశాల విద్యార్థులు, కళాకారులు, మెప్మా మహిళా సంఘాల పెద్ద ఎత్తున పాల్గొన్నాయని, వీరు ఇంటికి వెళ్లిన తరువాత ఆ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని, గ్రీనరీ పెంచే దిశగా మొక్కలు నాటి వాటిని పూర్తి స్థాయిలో సంరక్షించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించడానికి ప్రజలు సంపూర్ణంగా సహకరించాలని ఆయన కోరారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాలను ప్రతి రోజు పక్కాగా నిర్వహించి రాష్ట్రంలోనే మన జిల్లా ప్రథమ స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలని , ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో తగ్గించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం స్వచ్ఛదనం – పచ్చదనం వ్యాస రచన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అదనపు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ ప్రమోద్ కుమార్, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంలో బ్రేక్ దర్శనం ప్రారంభించిన ప్రభుత్వ విప్



వేములవాడ ఆగస్టు 5 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : దర్శనం అనంతరం ఆయన మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరుగాంచిన రాజన్న దేవాలయంలో బ్రేక్ దర్శనం ప్రారంభించుకోవడం శుభపరిణామం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,దేవాదయ శాఖ వారి ఆధ్వర్యంలో భక్తులుకు శీఘ్ర దర్శనం కలిగేలా ఒక మహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. యాదాద్రి,తిరుమల తిరుపతి దేవస్థాన తరహాలో వేములవాడ రాజన్న ఆలయంలో కూడా ప్రతి భక్తుడికి శీఘ్రదర్శనము కలిగేలా బ్రేక్ దర్శనం ఏర్పాటు చేసుకున్నాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే రాజన్న భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా రాజన్న ఆలయంలో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తాం. ప్రతిరోజు ఉదయం 10:15 నుంచి 11:15 వరకు సాయంత్రం నాలుగు 4:00 నుంచి 5:00 నిమిషాల వరకు బ్రేక్ దర్శనం ఏర్పాట్లు చేస్తున్నాం.బ్రేక్ దర్శనం ఏర్పాటు చేయడం పట్ల భక్తులు చాలా ఆనందం వ్యక్తం చేస్తున్నారు..ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పారిశుధ్య నిర్వహణ, మంచినీటి వసతి వంటి మెరుగైన వసతులు కల్పిస్తాం..శ్రావణమాసం మొదటిరోజు బ్రేక్ దర్శనం ప్రారంభించుకోవడం చాలా శుభ పరిణామం రాజన్న ఆలయానికి గత పాలకులు ఏటా 100 కోట్లు కేటాయిస్తాం అని మోసం చేసారు. గత పాలకులు రంగురంగుల బ్రోచర్లలను చూపిస్తు ఆలయాన్ని అభివృద్ధి చేసాం అని గొప్పలు చెప్పారు తప్ప క్షేత్రస్థాయిలో ఎక్కడ కూడా అభివృద్ధి చేయలేదు. ప్రభుత్వ ఏర్పడిన మొదటి మూడు నెలల్లోనే విటీడీఏ సమావేశం ఏర్పాటు చేసి 20 కోట్ల నిధులను వెనక్కి తీసుకొచ్చాం. మొన్నటి బడ్జెట్లో రాజన్న ఆలయానికి 50 కోట్ల నిధులు కేటాయించడం జరిగింది. గతంలో కేసీఆర్ నా లగ్గం ఇక్కడే అయ్యింది ఏటా రాజన్న ఆలయానికి 100 కోట్లు కేటాయిస్తాం అని మోసం చేశారు. గత ప్రభుత్వంలో రాజన్న ఆలయానికి నిధులు కేటాయించకపోగా రాజన్న దేవాలయం నుండి ఆరు కోట్ల నిధులను ఇతర దేవాలయాలకు మళ్లించారు. ఇటీవల శృంగేరి పీఠానికి వెళ్లిన సందర్భంలో వేములవాడ రాజన్న ఆలయం అభివృద్ధి,విస్తరణ పై వారికి తెలియజేయడం జరిగింది. వారి సూచన మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవాదాయ మంత్రివర్యుల సహకారంతో దేవాలయాన్ని అభివృద్ధి చేస్తాం. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

# స్వచ్ఛదనం పచ్చదనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ ఆగస్టు 5 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : వేములవాడ పట్టణంలోని సినారె కళామందిరంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం పచ్చదనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. అనంతరం తెలంగాణ చౌక్ నుండి బద్ది పోచమ్మ దేవాలయం వరకు ర్యాలీ నిర్వహణ మున్సిపల్ చైర్మన్ తో కలసి స్వయాన పరిసరాలు పరిశుభ్రం చేసిన ప్రభుత్వ విప్ అనంతరం ఏర్పాటు చేసి సమావేశంలో మాట్లాడు స్వచ్ఛదనం పచ్చదనం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం చేస్తున్న సందర్భంగా వేములవాడ పట్టణంలో ప్రారంభించుకోవడం సంతోషకరం. ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించుకునేందుకు ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఆరోగ్యమే మహాభాగ్యమని చిన్నప్పుడు పాఠ్యపు పుస్తకాల్లో చదువుకున్నాం.. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ మన చుట్టుపక్కల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చెట్లను పెంచడం వలన స్వచ్ఛమైన ఆక్సిజన్ లభించి మన జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. గ్రామాల్లో అడవులు అంతరించిపోతున్నాయి,పట్టణంలో చెట్లు చెట్లు నశించి పోవడం మూలాన వాతావరణం లో కార్బన్డయాక్సైడ్ స్థాయి పెరిగే ప్రమాదం ఉంది. కావున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని అందరూ భాగస్వామ్యం కావాలి. వచ్చాం వెళ్ళాం అని కాకుండా ప్రభుత్వం తీసుకున్న కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలి. మనం పెట్టె చెట్లను కాపాడుకోవాలి దీని ద్వారా రానున్న తరాలకు ఎంతో మేలు చేసిన వారిమీ అవుతాం.

# నూతన పల్లె దవాఖాన నిర్మాణనికి భూమి పూజ చేసిన ప్రభుత్వ విప్



వేములవాడ ఆగస్టు 5 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గారు పాల్గొని పాఠశాల విద్యార్థులతో,గ్రామస్తులతో కలిసి ర్యాలీగా వెళ్లి మొక్కలను నాటారు.. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పల్లె దవాఖానకి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు..

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.